
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

భద్రాద్రి కొత్తగూడెం
శనివారం ఉష్ణోగ్రత ఖమ్మం: గరిష్ఠం 31 । కనిష్ఠం 21 | భద్రాద్రి: గరిష్ఠం 30 । కనిష్ఠం 20 ఆదివారం, 28 జనవరి 2024

పదవీ కాలం ముగుస్తోందని
సర్పంచ్‌లు బాధపడొద్దు

- ఐదేళ్లలో వారు పూర్తిచేయలేకపోయిన పనులు నేను పూర్తి చేస్తా
- మంచుకొండ ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల


మాట్లాడుతున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రఘునాథపాలెం, జనవరి 27: సర్పంచ్‌లు తమ పదవీ కాలం ముగుస్తుందని బాధపడొద్దని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానికంగా ఎన్నో రాజకీయ ఇబ్బందులను ఎదుర్కొని కాంగ్రెస్‌ను గెలిపించారని, గత ఐదేళ్ల కాలంలో సర్పంచ్‌లు చేయలేకపోయిన అభివృద్ధి, సంక్షేమ పనులను తన దృష్టికి తీసుకొస్తే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో ఎటువంటి బెదిరింపులు, అక్రమ కేసులు, భూకబ్జాలు ఉండబోవని తెలిపారు. రఘునాథపాలెం మండలం మంచుకొండ సర్పంచ్ వాంకుడోత్ విజయాదీపక్ ఆధ్వర్యంలో శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తల కష్టంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఇకపై కార్యకర్తలు,నాయకులు ఎటువంటి ఇబ్బందులు పడాల్సిన పనిలేదన్నారు. విజయం కోసం కృషి చేసినవారికి అన్ని వేళలా అండగా ఉంటానన్నారు. కాంగ్రెస్ కార్యకర్తల రుణం తీర్చుకునే బాధ్యత తనపై ఉందన్నారు. అభివృద్ధి కోసమే రఘునాథపాలెం కేంద్రంగా మండలం ఏర్పాటు చేయించామన్నారు. ఇందుకు నాటి కాంగ్రెస్ మంత్రులు రాంరెడ్డి వెంకటరెడ్డి, జానారెడ్డి సహకరించారని గుర్తు చేశారు. ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు కావాల్సిన అన్ని సౌకర్యాలను కల్పిస్తానని మంత్రి తుమ్మల హామీ ఇచ్చారు. సీతారామా ప్రాజెక్టు నీళ్లను పాలేరు నియోజకవర్గంతో పాటుగా రఘునాథపాలెం మండలానికి తీసుకొస్తానన్నారు. ఈ విషయంపై ఇప్పటికే ఇరిగిషన్‌శాఖ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు.

మంచుకొండ హెల్త్ సబ్ సెంటర్ భవనానికి శంకుస్థాపన

రఘునాథపాలెం మండలం మంచుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మంచుకొండ ఆరోగ్య ఉప కేంద్రానికి రూ.20లక్షలతో శాశ్వత భవనానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. పేద ప్రజలకు ప్రభుత్వం పేదలకు కార్పొరేట్‌స్థాయి వైద్య సేవలు అందిస్తుందన్నారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వాంకుడోత్ విజయాదీపక్, ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మల్లేపల్లి సర్పంచ్ వెంకన్న, ఎంపీడీవో రామకృష్ణ, మండల వైద్యాధికారి బాలకృష్ణ పాల్గొన్నారు.

వలస గోడు


జూలూరుపాడులో మిర్చి పనులకు వెళ్తున్న ఛత్తీస్‌గఢ్ కూలీలు

- శ్రమ దోపిడీకి గురవుతున్న వలస కూలీలు
- దళారుల చేతుల్లో భంగపాటు
- పని ప్రదేశాల్లో నామమాత్రంగా సౌకర్యాల కల్పన
- కూలీల పిల్లలకు అందని పౌష్టికాహారం

జూలూరుపాడు, జనవరి 27: ఉపాధి కరువై-కుటుంబ పోషణ బరువై పూట గడవడం భారమై.. సొంత ఊళ్లను వదిలి పొరుగు రాష్ట్రానికి బతుకుతెరువు కోసం వచ్చిన కూలీలు వారు.. పొట్ట చేతబట్టుకొని పిల్లలతో ఇక్కడకు వచ్చి చేలల్లోనే గుడారాలు వేసుకొని రోజువారీ కూలి పనులు చేసుకుంటున్న వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఉపాధికోసం జిల్లాకు వలస వచ్చిన ఇతర రాష్ట్రాల కూలీలు దళారుల చేతుల్లో దగా పడుతున్నారు. తమ ప్రాంతాలలో పనులు దొరుక్క ఒడిశా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రాలలోని పలు గ్రామాలకు చెందిన కూలీలు భద్రాద్రి జిల్లాలోని పలు మండలాలకు వలస వచ్చారు. ప్రస్తుతం మిరప కోతల పనులు ముమ్మరంగా సాగుతుండడంతో చేతినిండా పని లభిస్తుందని వీరంతా తెలంగాణ బాట పట్టారు.

నిలువునా శ్రమ దోపిడీ

వలస కూలీలు రోజంతా చమటోడ్చినా తక్కువ వేతనాన్నే చెల్లిస్తున్నారు. తెల్లవారుజాము నుంచే కూలీలు మిర్చీ తోటల్లోకి వెళ్లి మిరపకాయలను కోయడం మొదలు పెడుతున్నారు. చీకటి పడే వరకు రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి మిరప కోత పనులు చేపట్టినా వారికి శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. కూలీలు కోసిన మిర్చీని తూకం వేసే సందర్భంలో కొందరు రైతులు 5 కేజీలు తక్కువగా చూపించి కూలీ చెల్లిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఈ కూలీలకు స్థానిక భాష రాకపోవడంతో పాటు, వారి అమాయకత్వం రైతులకు, దళారులకు వరంగా మారింది. స్థానిక కూలీలకు, వలస కూలీలకు చెల్లింపుల్లో వివక్ష చూపుతున్నారు. స్థానికులకు కేజీకి రూ.12నుంచి రూ.15ల వరకు చెల్లిస్తుండగా వలస కూలీలకు మాత్రం కేజీకి రూ.8నుంచి రూ.10 లోపే చెల్లిస్తున్నారు. భద్రాద్రి జిల్లాకు ఇప్పటికే సుమారు 15వేల మందికి పైగా వలస కూలీలు మిర్చీ కోతలకు రాగా ఏ ఒక్కరు సంతృప్తి చెందడం లేదు.

అడుగడుగునా దగా.. మోసం

ఎక్కువ కూలీ చెల్లిస్తామని కూలీలను మభ్యపెట్టి ఆ మేరకు ఒప్పందం చేసుకున్న రైతులు, దళారులు ఆచరణలో మాత్రం ఆ కూలీలను బురిడి కొట్టించి దగా చేస్తున్నారు. తూకాల్లోనూ మోసం చేస్తూ వేతనాన్ని తక్కువగా చెల్లిస్తున్నారు. సుజాతనగర్, టేకులపల్లి, పాల్వంచ, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి, చర్ల తదితర మండలాలలో దళారులు, రైతులు కలిసి వలస కూలీల శ్రమను దోచుకుంటున్నారు. కొంతమంది బ్రోకర్లుగా మారి వలస కూలీలను తీసుకొచ్చి ఎకరానికి రూ.2 వేల చొప్పున రైతుల నుంచి కమిషన్‌ను తీసుకొని కూలీలను పనులకు పంపుతున్నారు. కానీ కూలీలకు మాత్రం డబ్బులు సక్రమంగా చెల్లించడం లేదు. వారికి సరైన వసతులను కల్పించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూలూరుపాడు మండలంలోని పాపకొల్లుకు చెందిన ఓ రైతు కొన్ని రోజుల క్రితం కూలీలతో మిరప కోత పనులు చేయించుకొని తక్కువ కూలి చెల్లించడంతో వారు మధ్యలోనే పనులు నిలిపివేసి వేరే రైతు పనులకు వెళ్లేందుకు సిద్ధపడ్డారు. దీంతో సదరు రైతు అడ్డుకోగా వివాదం తలెత్తింది. గత ఏడాది మండలంలోని పాపకొల్లు, కొత్తూరు, గుండెపుడి, గాంధీనగర్, వినోభానగర్ గ్రామాలలో కొంతమంది రైతులు కూలీల చేత మిరప కాయలు కోయించుకొని డబ్బులు ఇవ్వకపోవడంతో పది నుంచి పదిహేను మంది వలస కూలీల ముఠాలు పోలీసులకు ఫిర్యాదులు చేశాయి. ప్రతీ ఏడాది ఇలాంటి సంఘటనలు అనేకం వెలుగు చూస్తూనే ఉన్నాయి.

పోషకాహారం అందక.. అనారోగ్యం పాలవుతున్న చిన్నారులు

వలస కూలీలు తమ కుటుంబాలతో వచ్చి చేలల్లోనే డేరాలు వేసుకొని ఉంటున్నారు. రాత్రి వేళ చలి వణికిస్తున్నా భరిస్తూ రోజులు గడుపుతున్నారు. వారు పిల్లలను కూడా వెంట తీసుకొని రావడంతో పగలు తల్లిదండ్రులు మిర్చీ కోత పనుల్లో నిమగ్నమైతే పిల్లలు రోడ్ల వెంట, చేలల్లోని గెట్లపై ఆడుతున్నారు. ఈ పిల్లలంతా పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఐదేళ్ల లోపు చిన్నారులు ఎంతో మంది ఉన్నారు. వీరికి స్థానికంగా ఆధార్‌కార్డులు లేకపోవడంతో ఇక్కడి అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారం అందించే పరిస్థితి లేదు. దీంతో పిల్లలు బక్కచిక్కి అనారోగ్యానికి గురతున్నారని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. తమ పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని కోరుతున్నారు.


జూలూరుపాడులో మిర్చి ఏరుతున్న మధ్యప్రదేశ్ కూలీలు


చేలల్లోనే గుడిసెలు ఏర్పాటుచేసుకున్న కూలీలు

బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో
ప్రశ్నిస్తే కేసులు, అరెస్టులు

- సంపదను లూటీ చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారు
- ప్రజాపాలన ద్వారా ప్రజలకు స్వేచ్ఛ, విముక్తి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మధిరటౌన్, జనవరి 27: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా పోయిందని, ప్రశ్నించినవారిపై కేసులు. అరెస్టులతో నిర్బంధ పాలన సాగించారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క విమర్శించారు. మధిర మండలంలో శనివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బయ్యారంలో రూ.20లక్షలతో నిర్మించిన నూతన పంచాయతీ భవనాన్ని, చిలుకూరులో రూ.కోటిలో నిర్మించిన పాఠశాల అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్‌ను, నిదానపురంలో రూ.20లక్షలతో నిర్మించిన పల్లెదవాఖానా భవనాన్ని ప్రారంభించారు. చిలుకూరులో జరిగిన సభలో భట్టి మాట్లాడుతూ పోరాటి సాధించుకున్న తెలంగాణలో గత ఎన్నికల్లో నిర్బంధానికి, నిరంకుశత్వానికి ప్రజలు చరమగీతం పాడి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారన్నారు. ప్రజల ఆకాంక్షలు, ఆశలు నెరవేర్చేందుకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు వళ్ల దగ్గర పెట్టుకుని పనిచేస్తామన్నారు. ప్రజల సంపదకు కస్టోడియన్‌గా ఉంటామని హామీ ఇచ్చారు. నాలుగు దశాబ్దాల ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ పార్టీ సంపదతో కూడిన తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆ సంపదను లూటీ చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అప్పులు పాలు చేసిందన్నారు. గతంలో ముఖ్యమంత్రి వస్తున్నాడంటే ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు ఉండేవన్నారు. కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం బతకాలంటే ప్రశ్నించేవాడు ఉండాలనే ఉద్దేశంతో ధర్నాచౌక్‌ను తెరిపించామన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు సాగిన తన పాదయాత్రలో ప్రజల కష్టాలు, నష్టాలను చూశానని, వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ మెనిఫెస్టోలో చేర్చామని తెలిపారు., అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే రెండు గ్యారెంటీలు అమలు చేశామని, రానున్న రోజుల్లో మరికొన్నింటిని అమలు చేస్తామన్నారు. త్వరలోనే నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇచ్చి ఉద్యోగాలను భర్తీ చేస్తామన్నారు. అందులో భాగంగా ఇప్పటికే టీఎస్‌పీఎస్‌సీకి నూతన పాలకమండలిని ఏర్పాటు చేశామని తెలిపాపరు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నిడమానూరు వంశీ, గొర్రెముచ్చు జయమ్మ, బాదా కృష్ణారెడ్డి, ఎంపీపీ లలిత, డీఈవో సోమశేఖర శర్మ, డీఎంహెచ్‌వో మాలతి, ఆర్డీవో గణేష్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో సిలార్‌సాహెబ్ జిల్లా, మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.


చిలుకూరు హైస్కూల్‌లో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న భట్టి


మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి

డీసీఎంఎస్ చైర్మన్‌గా కొత్వాల
బాధ్యతల స్వీకరణ



ఖమ్మం, జనవరి 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం డీసీఎంఎస్ చైర్మన్‌గా ప్రస్తుత ఉపాధ్యక్షుడిగా ఉన్న కొత్వాల శ్రీనివాసరావు శనివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. పాల్వంచ సొసైటీ అధ్యక్షుడిగా ఉన్న కొత్వాల గత ఎన్నికల్లో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇటీవల డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్న రాయల వెంకట శేషగిరిరావు డీసీసీబీలో డిఫాల్టర్‌గా తేలటంతో ఆయన గంగదేవిపాడు సొసైటీ డైరెక్టర్ పదవిపై అనర్హత వేటు పడింది. దాంతో అక్కడ సొసైటీ అధ్యక్ష పదవితో పాటు డీసీఎంఎస్ చైర్మన్ పదవి కూడా కోల్పోయారు. ప్రస్తుత డీసీఎంఎస్ వైస్ చైర్మన్‌గా ఉన్న కొత్వాల శ్రీనివాసరావుకు చైర్మన్‌గా బాధ్యతలు అప్పగిస్తూ డీసీవో విజయకుమారి ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆయన శనివారం డీసీఎంఎస్ కార్యాలయానికి వెళ్లి బాధ్యతలు స్వీకరించారు. గతంలో బీఆర్‌ఎస్‌లో ఉన్న కొత్వాల శ్రీనివాసరావు ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. త్వరలో డీసీఎంఎస్ చైర్మన్ నోటిఫికేషన్ వెలువడనుంది.


పరీక్షకు హాజరైన విద్యార్థులు

ప్రశాంతంగా
జేఈఈ మెయిన్స్

తొలిరోజు 1,578మంది పరీక్షలకు హాజరు

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 27: దేశవ్యాప్తంగా ఎన్.టి.ఏ వారు నిర్వహిస్తున్న జేఈఈ మెయిన్స్ 2024 మొదటి విడత పరీక్షలు శనివారం ఖమ్మం జిల్లాలో ప్రశాంతంగా సాగాయి. మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో పరీక్ష నిర్వహించారు. మెత్తం 1,592 మంది విద్యార్థులకు గాను 1,578 మంది పరీక్షకు హాజరయ్యారు. 14 మంది గైర్హాజరయ్యారని జిల్లా కో-ఆర్డినేటర్ ఆర్. పార్వతీరెడ్డి తెలిపారు. విద్యార్థులను పరీక్ష సమయానికి ఒక గంట ముందునుంచే తనిఖీ చేసి పరీక్షా కేంద్రాలలోకి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థుల హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేశారు.


విద్యార్థులను తనిఖీ చేసి లోనికి పంపిస్తున్న దృశ్యం

ఏకగ్రీవంగా ఎన్నికై.. అవిశ్వాసం ఎదుర్కొని

- హైకోర్టు పరిధిలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల భవితవ్యం
- వీవీ.పాలెం సొసైటీ అవిశ్వాస ఓటింగ్‌లో పాల్గొన్న 11మంది డైరెక్టర్లు
- హైకోర్టు ఆదేశాలతో ఫలితాలు ప్రకటించని జిల్లా సహకార అధికారి
- రాజకీయాలకు అతీతంగా ఓటింగ్: సొసైటీ డైరెక్టర్లు



విజయకేతనం చూపుతున్న సొసైటీ డైరెక్టర్లు

రఘునాథపాలెం, జనవరి 27: ఖమ్మం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కూరాకుల నాగభూషయ్య ప్రాతినిధ్యం వహిస్తున్న రఘునాథపాలెం మండలం వీ.వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ పదవిపై ఆ సొసైటీ డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ ప్రక్రియ ముగిసింది. శనివారం ఓటింగ్ నిర్వహించగా మొత్తం 13మంది డైరెక్టర్లకు గాను 11మంది హాజరై ఓటు వేశారు. సొసైటీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యతో పాటు మరో డైరెక్టర్ ఈ అవిశ్వాస సమావేశానికి గైర్హాజరయ్యారు. అయితే ఈ అవిశ్వాస తీర్మానంపై కూరాకుల హైకోర్టును ఆశ్రయించడంతో ఓటింగ్ ఫలితాన్ని ఈ నెల 30వరకు వెల్లడించవద్దని కోర్టు స్టే విధించింది. దాంతో హైకోర్టు నిర్ణయం మేరకు ఖమ్మం జిల్లా సహకారశాఖ అధికారి విజయకుమారి అవిశ్వాస సమావేశంలో జరిగిన ఓటింగ్ ఫలితాలను అధికారికంగా వెల్లడించలేదు.

ఏకగ్రీవం.. అవిశ్వాసం

1962లోఏర్పాటు చేసిన వీ.వెంకటాయపాలెం సొసైటీలో మొత్తం 5,946మంది సొసైటీ ఓటర్లు ఉన్నారు. రూ.12కోట్లవరకు లావాదేవీలు జరుగుతున్నాయి. ఇప్పటివరకు పదిమంది సొసైటీ చైర్మన్లు పదవీ కాలం పూర్తి చేయగా 11వ చైర్మన్‌గా కూరాకుల నాగభూషయ్య మాత్రమే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే సొసైటీ చరిత్రలోనే అవిశ్వాసం ఎదుర్కొన్న చైర్మన్‌గా కూడా కూరాకుల రికార్డుల్లోకి ఎక్కారు.

సొంత ఓటు వేసుకోలేకపోయిన కూరాకుల

ఈ నెల 11న వీ.వెంకటాయపాలెం సొసైటీలోని మొత్తం 13మంది డైరెక్టర్లలో 11మంది డైరెక్టర్లు జిల్లా సహకార అధికారి విజయకుమారికి చైర్మన్ కూరాకులపై అవిశ్వాసం వ్యక్తం చేస్తూ లేఖను అందించారు. దాంతో 15రోజులు గడువు పెట్టిన అధికారి డైరెక్టర్లుకు నోటీసులను జారీ చేసి 27న ఉదయం 11గంటలకు వీ వెంకటాయపాలెం సొసైటీ కార్యాలయానికి హాజరు కావాలని కోరారు. దీంతో సొసైటీ డైరెక్టర్లు రావెళ్ల శ్రీనివాసరావు, చంద్ర మురళీకృష్ణ, బాణోత్ వెంకన్న, జోగు అనిత, గోడ్ల సుగుణ, బానోత్ రామారావు, తేజావత్ బావ్‌సింగ్, రావూరి సైదబాబు, గుండే ఆదినారాయణ, గోపగాని ముత్తిలింగం, మొర్రిమేకల నాగేశ్వరరావు శనివారం ఉదయం 10.25గంటలకు సొసైటీ కార్యాలయానికి వచ్చారు. 10.30గంటలకు సొసైటీ కార్యాలయానికి చేరుకున్న జిల్లా సహకార అధికారి విజయకుమారి రూ.12.10గంటలకు అవిశ్వాసంపై ఓటింగ్ ప్రక్రియను పూర్తి చేశారు. కాగా సొసైటీలోని మరో డైరెక్టర్ మేకపోతుల సింహాద్రి తాను ఓటింగ్‌కు దూరంగా ఉన్నట్లు ప్రకటించారు. ఇక వీవీ పాలెం సొసైటీ చైర్మన్‌గా, డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్న కూరాకుల నాగభూషయ్య తన ఓటును కూడా వేసుకోలేదు. అనంతరం జిల్లా సహకార అధికారి విజయకుమారి మాట్లాడుతూ ఈ అవిశ్వాసంపై చైర్మన్ కూరాకుల హైకోర్టును ఆశ్రయించడంతో కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 30వరకు అవిశ్వాస ఓటింగ్ ఫలితాలను ప్రకటించటం లేదన్నారు. ఎస్‌ఐ కొండల్‌రావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

'రాజకీయాలకు అతీతంగా ఓటింగ్'

వీ.వెంకటాయపాలెం సొసైటీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్యపై ప్రవేశపెట్టిన అవిశ్వాసం రాజకీయాలకు అతీతమైనదని డైరెక్టర్ రావెళ్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. అవిశ్వాసం కోరిన 11మంది ఓటింగ్ సమయానికి హాజరై ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. అనుకున్న లక్ష్యాన్ని సాధించామన్నారు. రాజకీయ సమీకరణాలకు ఈ అవిశ్వాసానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. అన్ని రాజకీయ పార్టీల వాళ్లు డైరెక్టర్లుగా పనిచేస్తున్నారని తెలిపారు. కేవలం సొసైటీ చైర్మన్ పని విధానం నచ్చకపోవటంతోనే అవిశ్వాసం కోరామన్నారు. రాష్ట్ర సహకారశాఖ మంత్రిగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావు స్పందించి వీ వెంకటాయపాలెం నుంచి ఖాళీ అవుతున్న స్థానాలను ఇదే సొసైటీనుంచి భర్తీ చేసి తమ సొసైటీకి గౌరవాన్ని ఇవ్వాలని కోరారు. మరో డైరెక్టర్ రావూరి సైదబాబు మాట్లాడుతూ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన కూరాకుల నాగభూషయ్యకు వీవీపాలెం సొసైటీ డైరెక్టర్ల పేర్లు కూడా తెలియదన్నారు. పనితీరు మార్చుకోవాలని పలుమార్లు డైరెక్టర్లు సూచించినా చైర్మన్‌లో మార్పు రాలేదని అందుకే అవిశ్వాసం వరకు వెళ్లామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హనుమంతరావు, సొసైటీ పరిధిలోని కాంగ్రెస్ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న డైరెక్టర్లు

మావోయిస్టుల కదలికలపై
అప్రమత్తంగా ఉండాలి

- పార్లమెంటు ఎన్నికలు సజావుగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలి
- సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలి
- పోలీసు అధికారులతో సమీక్షలో ఎస్‌ఐబీ డీఐజీ సుమతి


సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఎస్ఐబీ డీఐజీ) సుమతి

భద్రాచలం, జనవరి 27: త్వరలో నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలని స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(ఎస్ఐబీ డీఐజీ) బి. సుమతి ఆదేశించారు. భద్రాద్రి జిల్లా సారపాక ఐటీసీ అతిథి గృహంలో జిల్లా పోలీసు అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐజీ సుమతి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పని చేసే పోలీసు అధికారులు ఎప్పటికప్పుడు మావోయిస్టుల కదలికలపై అప్రమత్తంగా ఉంటూ సమాచారం సేకరించాలని సూచించారు. జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం తనిఖీలు చేపట్టాలన్నారు. సీఆర్‌పీఎఫ్ బలగాలతో సమన్వయం చేసుకుంటూ రాబోయే పార్లమెంటు ఎన్నికలను విజయవంతం చేయాలని కోరారు. అంతకు ముందు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్, డీఐజీ సుమతిని కలిశారు. ఈ సందర్భంగా జిల్లాలో ప్రస్తుత పరిస్థితులను డీఐజీ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో ఎస్ఐబీ ఎస్పీ వి.రాజేష్, 81బీఎన్ సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ మనీష్‌కుమార్ మీనా, 141 సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రితేష్ ఠాకూర్, కొత్తగూడెం ఓఎస్‌డీ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్, 151 బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ అయోధ్య సింగ్, డీఎస్పీలు వెంకటేష్, రాఘవేంద్రరావు, రమణమూర్తి, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అంతకు ముందు ఐటీసీ విశ్రాంతి భవనానికి వచ్చిన స్పెషల్ ఇంటిలిజెన్స్ బ్యూరో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ బి.సుమతిని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.


సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఏజెన్సీవాసులకు ఇకపై సత్వర న్యాయం

హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ వేణుగోపాల్, కాజా శరత్

భద్రాచలంలో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రారంభం

భద్రాచలం, జనవరి 27: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుతో ఏజెన్సీ ప్రజలకు ఇకపై సత్వర న్యాయం అందుతుందని హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్టుఫోలియో జడ్జి ఈవీ వేణుగోపాల్ తెలిపారు. భద్రాచలంలోని ప్రథమశ్రేణి జ్యూడిషియల్ న్యాయస్థానం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టును శనివారం న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భద్రాచలంలో అదనపు జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుతో భద్రాద్రి ఏజెన్సీ ప్రజలకు సత్వర న్యాయం అందుతుందన్నారు. ఇప్పటి వరకు పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించేందుకు మార్గం సుగమం అవుతుందన్నారు. భద్రాచలం బార్ అసోసియేషన్‌కు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేకత ఉందన్నారు. భద్రాద్రి బార్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు న్యాయవాదులు హైకోర్టు న్యాయమూర్తులుగా నేడు బాధ్యతలు నిర్వహిస్తుండటంతో భద్రాద్రి బార్ అసోసియేషన్‌కు రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక గుర్తింపును చాటుకుందన్నారు. హైకోర్టు న్యాయమూర్తి కాజా శరత్ మాట్లాడుతూ ఇదే బార్ నుంచి తాను 22 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు ప్రాక్టీసు కోసం వెళ్లినట్లు తెలిపారు. ఈ క్రమంలోనే హైకోర్టు న్యాయమూర్తిగా పని చేసే అవకాశం లభించిందన్నారు. భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోట దేవదానం మాట్లాడుతూ తాను బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు రావడం గర్వకారణమన్నారు. భద్రాచలానికి అదనపు సెషన్స్‌కోర్టును మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఆయన హైకోర్టు న్యాయమూర్తులను కోరారు. అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టు ప్రారంభాన్ని పురస్కరించుకొని కొత్తగూడెం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మున్సిఫ్ రామారావు కేసుల విచారణను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులను భద్రాచలం బార్ అసోసియేష్, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయాధికారి పి.వసంత్, కొత్తగూడెం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మున్సిఫ్ రామారావు, భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి నాగేశ్వరరావు, అడిషనల్ జ్యూడిషియల్‌ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుచరిత, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్, భద్రాచలం మొబైల్ కోర్టు మేజిస్ట్రేట్ బి. శివాజీ, భద్రాచలం, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట దేవదానం, రమేష్‌కుమార్ మక్కడ్ పాల్గొన్నారు.



అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి వేణుగోపాల్



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తివేణుగోపాల్

భద్రాద్రిలో భక్తుల సందడి

నిత్యకల్యాణంలో పాల్గొన్న 219 జంటలు .. రామయ్యను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తులు

భద్రాచలం, జనవరి 27: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలివచ్చారు. భద్రాద్రి రామయ్యకు నిత్యం నిర్వహించే నిత్యకల్యాణంలో శనివారం 219 జంటలు పాల్గొన్నాయి. ఉభయదాతలు అధికంగా ఉండటంతో దేవస్థానం అధికారులు చిత్రకూట మండప ప్రాంగణంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు.

రామయ్య సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

భద్రాద్రి రామయ్యను శనివారం హైకోర్టు న్యాయమూర్తులు ఈవీ వేణుగోపాల్, కాజా శరత్‌లు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం వేద పండితులు ఆశీర్వచనం పలికారు. దేవస్థానం తరఫున వారికి శాలువ, జ్ఞాపికను స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో వారి వెంట భద్రాద్రి జిల్లా ప్రధానన్యాయాధికారి పి.వసంత్, కొత్తగూడెం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మున్సిఫ్ రామారావు, భువనగిరి జూనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వరరావు, కొత్తగూడెం అడిషనల్ జ్యూడిషియల్‌ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సుచరిత, భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి పాల్గొన్నారు.



నిత్య కల్యాణంలో పాల్గొన్న భక్తులు

సైబీరియన్ కొంగను కాపాడిన వాకర్స్

జూలూరుపాడు, జనవరి 27: ఎక్కడ నుంచి వలస వచ్చిందో ఏమో కానీ... అనారోగ్యంతో బాధపడుతూ ఎగరలేని పరిస్థితిలో కన్పించిందో కొంగ దానిని వాకర్స్ అక్కున చేర్చుకొని కాపాడారు. ఈ సంఘటన శనివారం జూలూరుపాడులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే మండలంలోని వెంగన్న పాలెం, జూలూరుపాడు గ్రామానికి చెందిన కొందరు యువకులు (ఆరోగ్య జీవన యాత్ర సభ్యులు) సూరారం వెళ్లే రహదారిపై వాకింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో వలసకు వచ్చిన కొంగ అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో కన్పించింది. దీనిని చూసి చలించిన వీరు వెంటనే ఆ కొంగను తీసుకొని జూలూరుపాడులోని అటవీ శాఖ కార్యాలయం వద్దకు వచ్చి సిబ్బందికి అప్పగించారు. అటవీ సిబ్బంది ఆ కొంగను గుర్తించి సైబీరియన్ జాతికి చెందిన వలస పక్షిగా గుర్తించారు. దాని కుడి కాలుకు గాయం కావడంతో అది నిలవలేని స్థితిలో ఉందని ఎఫ్ఆర్వో ప్రసాద్‌రావు తెలిపారు. పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించి అటవీశాఖ కార్యాలయంలో కొంగకు చికిత్సలు చేయించారు. ఆ కొంగకు తగిన ఆహారాన్ని అందించి అది పూర్తిగా కోలుకున్న తరువాత ఆహారం దొరికే సురక్షిత ప్రదేశంలో వదిలివేస్తామని ఎఫ్ఆర్వో తెలిపారు. వలస పక్షి పట్ల వాకర్లు గడిదేశి ప్రేమ్‌కుమార్, నరేష్, బోస్, రఫీ, నాగరాజు, రాజు, ఎస్‌కె.నాగూల్ చూపిన ఔదార్యాన్ని స్థానికులు కొనియాడారు.



కొంగకు చికిత్స నిర్వహిస్తున్న పశుసంవర్ధక సిబ్బంది



గాయపడ్డ సైబీరియన్ కొంగను ఎఫ్‌డీవో నరసింహారావుకు అందజేస్తున్న వాకర్స్

ఖమ్మం మార్కెట్‌లో దానం విధానం రద్దు

వ్యాపార, కార్మిక సంఘాలతో సమీక్షలో అదనపు కలెక్టర్ నిర్ణయం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఖమ్మం మార్కెట్, జనవరి 27: ఖమ్మం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో రైతుల వద్ద కాంటాల సమయంలో హమాలీలు, స్వీపర్లు, రెల్లుడు కార్మికులు తీసుకునే దానం విధానాన్ని పూర్తిగా రద్దు చేశారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ శనివారం మార్కెట్ చాంబర్‌లో వ్యాపార, కార్మిక సంఘాలతో నిర్వహించిన సమీక్షలో తక్షణమే ముష్టి విధానానికి స్వస్తి పలకాలని అధికారులను ఆదేశించారు. ఈనెల 18న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'హమాలీల ఆగడాలు, దానం విధానాన్ని రద్దు చేయాలి' అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించి దాని రద్దుకు నిర్ణయం తీసుకున్నారు. సమీక్షలో భాగంగా ఆయన కమీషన్ వ్యాపారులు, ట్రేడర్లు, మహిళా స్వీపర్లు, రెల్లుడు కార్మికులతో ముచ్చటించారు. మార్కెట్‌కు పంట అమ్మేందుకు వచ్చిన అన్నదాతలను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ ప్రశ్నించారు. రైతు బాగుంటేనే మనందరం బాగుంటామని అన్నారు. రైతులకు నష్టం చేకూర్చవద్దని హితవు పలికారు. ఈ సందర్భంగా మహిళా స్వీపర్ల సంఘం కార్మిక సంఘం ప్రతినిధులు మార్కెట్లో ఇక నుంచి దానం అడగబోమని హామీ ఇచ్చారు. అనంతరం మార్కెట్‌లో పంటలకు ధరల హెచ్చు తగ్గులు ఎందుకు వస్తున్నాయని అని వ్యాపారులను ప్రశ్నించారు. రైతులకు పంట నాణ్యత మేరకు గిట్టుబాటు ధర కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, దిరిశాల వెంకటేశ్వరావు, గీతా వెంకన్న, గ్రేడ్-2 సెక్రెటరీ బజారు, అసిస్టెంట్ సెక్రెటరీ వజీరుద్దీన్ పాల్గొన్నారు.



వ్యాపార, కార్మిక సంఘం సమీక్షలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

గర్భిణి, నవజాత శిశువు మృతిపై విచారణ

చుంచుపల్లి, జనవరి 27 : ఇటీవల సుజాతనగర్ మండలానికి చెందిన గర్భిణి చింతల సింధుతోపాటు నవజాత శిశువు మృతిచెందిన సంఘటనపై వైద్యాధికారులు శనివారం విచారణ చేపట్టారు. సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కుమారస్వామి కొత్తగూడెం లోని రామవరం మాతా శిశు కేంద్రం (ఎంసీహెచ్)లో దర్యాప్తు చేపట్టేందుకు ముగ్గురు వైద్యాధికారులతో కూడిన బృందాన్ని నియమించారు. వీరిలో డాక్టర్లు పుష్పలత, సురేందర్, నరసింహారావుకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆ బృందం దర్యాప్తును వేగవంతంగా చేపట్టి పూర్తి నివేదికను అస్పత్రి సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ దర్యాప్తులో మృతి చెందిన గర్భిణి సింధు రామవరం ఎంసీహెచ్‌కు ఏ సమయంలో వచ్చింది, ఎలాంటి చికిత్స తీసుకుంది అని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఈ గర్భిణికి వైద్యం అందించిన అధికారులు, సిబ్బంది ఎవరు.. సిజేరియన్ సమయంలో ఉన్న స్టాఫ్‌లను ప్రత్యేకంగా వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. అనంతరం గర్భిణికి వైద్యం అందించే క్రమంలో ఆలస్యం చేశారా... కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి తరలించిన సమయంలో అందించిన వైద్య సేవలపై విచారణ అధికారులు ఆరా తీసి వివరాలు సేకరించినట్లు తెలుస్తున్నది. ఈ విచారణ సంఘటన నివేదిక డీఎంఈకి అందజేసి వైద్య సేవలో ఏదైనా నిర్లక్ష్యం ఉంటే వారిపై శాఖా పరమైన చర్యలు తీసుకుని, బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని సూపరింటెండెంట్ స్పష్టం చేశారు.

ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

వైరా, జనవరి 27: జడ్పీఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆర్.వీరస్వామి కోరారు. శనివారం వైరాలోని జీహెచ్ఎస్ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం క్యాలెండర్లు, డైరీలను పంపిణీ చేశారు. సమావేశంలో ఎంఈవో కొత్తపల్లి వెంకటేశ్వరరావు, కె.మార్క్, బి.విజయబాబు, మాధవరావు, మల్లేశ్వరి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న

రాజీవ్ ట్రోఫీ క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దయాకర్‌రెడ్డి

ఖమ్మం స్పోర్ట్స్, జనవరి 27: నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో రాజీవ్‌గాంధీ మెమోరియల్ రాజీవ్ ట్రోఫీ ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు తుంబూరి దయాకర్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. మూడో రోజు జరిగిన మ్యాచ్‌లలో కల్లూరు జట్టు ఏన్కూరు జట్టుపై, ఖమ్మం రూరల్ జట్టు కామేపల్లి జట్టుపై విజయం సాధించాయి. పోటీలను నిర్వాహకులు మతిన్ సమీక్షించారు.

ఆల్ ఇండియా టాక్స్ ప్రాక్టిషనర్స్

జాయింట్ సెక్రటరీగా సైదులు



జాయింట్ సెక్రటరీగా ప్రమాణస్వీకారం చేస్తున్న సైదులు

ఖమ్మం మార్కెట్ , జనవరి 27: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్స్ (సౌత్‌జోన్) జాయింట్ సెక్రెటరీగా నగరానికి చెందిన టాక్స్ ప్రాక్టీషనర్ ఉల్లిబోయిన సైదులు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈమేరకు శనివారం గుంటూరులో జరిగిన సంఘ ఆఫీస్ బేరర్ల సమావేశంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా టాక్స్ ప్రాక్టీషనర్స్ ఫెడరేషన్‌కు ఎంపికైన ఖమ్మం నగరానికి చెందిన తొలి టాక్స్ ప్రాక్టీషనర్ సైదులును జిల్లా టాక్స్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ బాధ్యులు దుర్గాప్రసాదరావు, పవన్‌కుమార్, రమేష్, శ్రీనివాసరావు తదితరులు అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించాని ఆకాంక్షించారు.

కిష్టారం సమస్యలు పరిష్కరించాలి



జీఎంకు సమస్యలు వివరిస్తున్న కిష్టారం గ్రామస్థులు

సత్తుపల్లి, జనవరి 27: సింగరేణి ప్రభావిత గ్రామం మండలంలోని కిష్టారంలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం సింగరేణి జీఎం షాలేంరాజును జేవీఆర్ ఓసీ పీవో కార్యాలయంలో అక్కడి ప్రజలు కలిశారు. సానుకూలంగా స్పందించిన ఆయన పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చెట్టుమాల రేణుక ఈశ్వర్, ఉప సర్పంచ్ కొలపనేని ధనుంజయ్, పీఏసీఎస్ అధ్యక్షుడు మామిళ్లపల్లి కృష్ణయ్య, గ్రామపెద్దలు ఉడతనేని అప్పారావు, నరుకుళ్ల శేషగిరిరావు, కొడిమెల అప్పారావు, గుద్లూరి రమణయ్య, రావి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి అభిషేకం

ఎర్రుపాలెం జనవరి 27: జమలాపురం దివ్యక్షేత్రంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సర్వాంగాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునే ఆలయ ప్రధాన అర్చకులు ఉప్పల విజయదేవశర్మ ఆధ్వర్యంలో శ్రీవారికి సుప్రభాతసేవ నిర్వహించి పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. ప్రతిష్టాస్వామికి నూతన పట్టువస్త్రాలు ధరింపజేసి భక్తులకు దర్శనం కలిగించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఆలయ సూపరింటెండెంట్ విజయకుమారి, సోమయ్య, కృష్ణప్రసాద్, సాయి, వంశీ, బాణావత్ విజయ్, మారుతిరావు పాల్గొన్నారు.



ధ్వజస్తంభం వద్ద భక్తుల పూజలు

అంధ విద్యార్థులకు సేవాసంస్థలు అండగా నిలవాలి

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం, జనవరి 27(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంధ విద్యార్థులను విద్యా, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో ప్రోత్సహించేందుకు సేవాసంస్థలు మరింత ముందుకు రావాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం చేతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ అంధ విద్యార్థులకు సేవలందించడం అదృష్టంగా భావించాలన్నారు. వారికి ప్రభుత్వం చేసే, సేవా ప్రోత్సాహక కార్యక్రమాలతో పాటు స్వచ్ఛంధ సేవా సంస్థలు సమాజంలో వీరికి మొదటి ప్రాధాన్యతగా విద్యాభివృద్ధికి సహకారం అందించాల్సిన అంవసరం ఉందన్నారు. తద్వారా అన్ని రంగాల్లో వారు రాణించగలుగుతారని తెలిపారు. భవిష్యత్తులో ఉన్నత విద్య చదువుతున్న అంధ విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లతో పాటు వారికి కావాల్సిన స్టడీమెటీరియల్, వారు చదువుకునేందుకు ఆర్థికసహకారం అందించేందుకు సేవా సంస్థలు తమవంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో చేతన ఫౌండేషన్ సభ్యులుపసుమర్తి రంగారావు, ముత్తినేని సురేష్, మాదినేని నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



అంధ విద్యార్థికి లాప్‌టాప్ అందిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దమ్మపేట, జనవరి 27 : పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ముకందాపురంలో శుక్రవారం రాత్రి జరిగింది. ఈఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముకుందాపురానికి చెందిన సంగం ఉదయగిరి (43) లారి క్లీనర్‌గా పని చేస్తున్నాడు. మద్యానికి బానిసై విధులకు కూడా వెళ్లడం లేదు. ఈ క్రమంలో మద్యానకి డబ్బులు ఇవ్వమని తల్లిని అడగగా తన దగ్గర లేవని చెప్పటంతో మనస్థాపంతో ఉదయగిరి శుక్రవారం పురుగుల మందు తాగాడు. వెంటనే గుర్తించిన కుటుంబ సభ్యులు సత్తుపల్లి వైద్యశాలకు అక్కడ నుంచి ఖమ్మం తరలించి చికిత్స నిర్వహిస్తుండగా శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు పిర్యాదు మేరకు ఎస్సై సాయికిషోర్‌రెడ్డి కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్, అర్బన్ పోలీసుల దాడులు

కార్పొరేటర్ భర్త, వైస్ ఎంపీపీతో పాటు మొత్తం 12మంది అరెస్టు

రూ.42,715నగదు, 73 క్యాష్ కాయిన్స్, 12 సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం

ఖమ్మంక్రైం, జనవరి27: నగరంలోని బాలాజీనగర్‌లో ఓ ఇంటిని అడ్డాగా చేసుకుని పేకాడుతున్న 12మందిని శుక్రవారం అర్థరాత్రి టాస్క్‌ఫోర్స్, ఖానా పురంహవేలి పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. వీరిలో ప్రధానంగా నగరానికి చెందిన ఓ కార్పొరేటర్ భర్తతోపాటు వైస్ ఎంపీపీ పట్టుబడ్డారు. గేట్‌కారేపల్లికి చెందిన యలమద్ది శేఖర్ నగరంలోని ఖానాపురం బాలాజీ నగర్‌లో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. ఆయన ఆధ్వర్యంలో కొద్దిరోజులుగా పేకాట నిర్వహిస్తున్నట్టు తెలిసింది. ఈనేపథ్యంలో గట్టయ్య సెంటర్‌కు చెందిన మండెపుడి సత్యనారాయణ, విజయనగర్ కాలనీకి చెందిన బల్లు సందీప్, కారేపల్లి వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, బాలాజీనగర్‌కు చెందిన పోటు ప్రసాదరావు, బ్యాంకు కాలనీకి చెందిన మండెపుడి నాగేశ్వరరావు, ఇందిరా నగర్‌కు చెందిన భాషా, వీడియోస్‌కాలనికి చెందిన కిలారు శ్రీనివాసరావు, గార్ల మండలానికి చెందిన మంగలి రాజశేఖర్, గేట్‌కారేపల్లికి చెందిన మండ్ల దీపక్, స్టేషన్ కారేపల్లికి చెందిన దుద్దుకూరి విజయ్‌తోపాటు నగరంలోని 29డివిజన్ కార్పరేటర్ భర్త కొప్పెర ఉపేందర్‌రావు పట్టుబడ్డారు. ఈసందర్భంగా పట్టుబడిన వారిని ఖమ్మంఅర్బన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి వారి వద్ద నుంచి 12సెల్‌ఫోన్లు, 73 క్యాష్‌కాయిన్లు, స్కూటీతోపాటు రూ.42,715నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిపై సెక్షన్ ,3,4 తెలంగాణ స్టేట్ గేమింగ్ యాక్ట్ కింద కేసులు నమోదుచేశారు. కాగా క్యాష్‌కాయిన్స్ ద్వారా పేకాట ఆడుతుండడంతో ఇంకా పెద్దవ్యక్తులు కూడా ఉండి ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదుగురిపై సిటీ పోలీస్ యాక్ట్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఐదుగురిపై సిటీపోలీసుయాక్ట్ కింద కేసు నమోదు చేసినట్టు ఏసీపీ హరి కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రావరం రాత్రి పోలీస్ పెట్రోలింగ్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులకు ధంసలాపురం బ్రిడ్జి కింద బహిరంగంగా ఐదుగురు వ్యక్తులు మద్యం తాగుతుండడంతో వారిపై సిటీ పోలీస్ యాక్టు కేసు నమోదుచేసినట్టు ఆయన ప్రకటనలో తెలిపారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ఖమ్మంక్రైం, జనవరి 27: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని లేనకుంటే చర్యలు తప్పవని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ శివరామయ్య సూచించారు. నగరం లోని టాస్క్‌ఫోర్ ఏసీపీ కార్యాలయంలో శనివారం ఖమ్మం డివిజన్‌లోని 22 మంది రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గతంలో ఏం చేశారో తెలియదని, ఇకనుండి సత్ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. గతాన్ని మరిచి నేరప్రవృత్తిని వీడి సమాజంలో మంచి నడవడికతో మంచి జీవితం గడపాలని, తొందరపాటులో చేసిన, నేరాలు, కుటుంబసభ్యులు సమాజంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. రౌడీషీటర్ల కదలికలపై అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని బైండోవర్ చేస్తామని, పద్ధతి మార్చుకోకుంటే పీడీ యాక్టులు నమోదుచేస్తామన్నారు.

జిల్లాలో పలువురు సీఐల బదిలీ

ఖమ్మంక్రైం, జనవరి27: జిల్లాలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ పోలీసుశాఖ నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఖమ్మం-1 టౌన్‌కు సీసీఆర్బీ సీఐగా ఉన్న వి.ఉదయ్ కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న టి.స్వామి సీసీఆర్బీకి బదిలీ అయ్యారు. భద్రాద్రి కొత్తగూడెంలోని దుమ్ముగూడెంలో సీఐగా విధులు నిర్వహిస్తున్న డి.రమేష్ ఖమ్మం త్రీటౌన్‌కు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బి.సత్యానారాయణ సీసీఎస్2కు బదిలీ అయ్యారు. ఖమ్మం సీసీఎస్2లో విధులునిర్వహిస్తున్న బి.బాలకృష్ణ ఖమ్మం-2టౌన్ సీఐగా నియమితులయ్యారు. ప్రస్తుతం ఇక్కడ ఉన్న కుమారస్వామి ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని పేర్కొన్నారు. సిద్దిపేట త్రీటౌన్ సీఐగా ఉన్న భానూప్రకాష్ ఖమ్మం ఖానాపురంపోలీసుస్టేషన్ సీఐగా నియమితులయ్యారు. ఇక్కడున్న టి.శ్రీహరి ఐజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని తెలిపారు. మహదేవపూర్ సర్కిల్ భూపాలపల్లిలో సీఐగా ఉన్న టి.కిరణ్ సత్తుపల్లిటౌన్ సీఐగా నియమితులయ్యారు. ఇక్కడ ఉన్న జే.మోహన్‌బాబు ఐజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని తెలిపారు. కాగా జిల్లాలో మరికొన్ని చోట్ల సీఐలు మారే అవకాశం ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రస్తుతం నియమితులైన సీఐలు నేడో, రేపో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఇరు జిల్లాల్లో పోలీసుల దాడులు

37 కిలోల గంజాయి పట్టివేత

నేలకొండపల్లి/ పాల్వంచ/ ఖమ్మం క్రైం, జనవరి 27: ఇరు జిల్లాల్లో శనివారం పలు ప్రాంతాల్లో పోలీస్, టాస్క్‌ఫోర్స్ ఎక్సైజ్ అధికారులు వేర్వేరుగా జరిపిన దాడుల్లో 37 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కూసుమంచి మండలం పాలేరు వద్ద 19 కేజీల గంజాయిని పట్టుకున్నారు. ఆర్టీసీ బస్సులో తనిఖీలు చేయగా ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వెళుతున్న సామిరన్ భైరాగి వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి 19 కేజీలున్నట్లు ఎక్సైజ్ అధికారులు చెప్పారు. కేసు నమోదు చేసి నిందితుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పోశెట్టి చెప్పారు. ఎస్సైలు రాధాకృష్ణ, శంకర్‌లతో పాటు సిబ్బంది సీఐ వెంట ఉన్నారు.

● ఖమ్మం నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా బ్యాగులతో వస్తుండడంతో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఆసంచుల్లో సుమారు 5కేజీల గంజాయి ఉన్నట్టు గుర్తించి వారిని అదుపులోకి తీసుకుని విచారించామని ఏసీపీ హరికృష్ణ తెలిపారు. పట్టుబడిన వారిలో హుజూరాబాద్‌కు చెందిన నీలం రాజుతోపాటు ఇద్దరు మైనర్లు కూడా ఉన్నారని ఏసీపీ తెలిపారు. గంజాయి తాగడానికి, అమ్మేందుకు శృంగవరపు కోట నుంచి తెలిసిన వ్యక్తి ద్వారా కొనుగోలుచేసి హుజూరాబాద్ వెళుతున్న నేపథ్యంలో పోలీసులకు పట్టుబడినట్టు ఆయన తెలిపారు. ఈసందర్భంగా వారిపై కేసు నమోదుచేసి వారి వద్దనుండి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

● పాల్వంచ మండలంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు శనివారం అక్రమంగా తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మండల పరిధిలోని జగన్నాధపురం పెద్దమ్మగుడి సమీపంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వాహన తనిఖీలు చేపట్టారు. భద్రాచలం నుంచి ఓవాహనంపై పాల్వంచ వైపు వస్తున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులకు అనుమానాస్పదంగా కన్పించారు. వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా బ్యాగులో 13 కేజీల ఎండు గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వెంకటసాయి, అనూప్‌రెడ్డిలు ఒడిశా సరిహద్దుల నుంచి ఓ వ్యక్తి వద్ద నుంచి కొనుగోలు చేసి నెల్లూరు తరలించి అక్కడ అధిక ధరకు విక్రయించి సొమ్ముచేసుకోవడానికి వారు గంజాయిని తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వారిరువురినీ అదుపులోకి తీసుకుని పాల్వంచ ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. ఎండు గంజాయి, ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.3.25 లక్షలు ఉంటుందని జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వరరావు తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ గౌతమ్, సిబ్బంది రామకృష్ణ గౌడ్, వెంకట నారాయణ, గురవయ్య, సుమంత్ పాల్గొన్నారు.


లారీ ఢీకొని యువకుడు మృతి

సత్తుపల్లిరూరల్, జనవరి27: లారీ ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సత్తుపల్లి మండలంలో శనివారం రాత్రి జరిగింది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుగ్గపాడుకు చెందిన సవలం లక్ష్మయ్య, జ్యోతి దంపతుల చిన్న కుమారుడు రాము (18) కూలీ పనులకు వెళ్తుంటాడు. పని ముగించుకుని ఇంటికి వచ్చాక భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాగుపల్లి గ్రామానికి సెల్‌ఫోన్ కోసం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్రగా యాలవ్వగా 108లో సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు.

పట్టభద్రుల ఓటు హక్కు నమోదుకు

10వేల దరఖాస్తులు!

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 27: ఫిబ్రవరి 6 వరకు జిల్లాలోని పట్టభద్రుల ఓటుహక్కు నమోదుకు భారత ఎన్నికల సంఘం అవకాశాన్ని కల్పించింది. ఖమ్మంలో ఇప్పటి వరకు 10వేల దరఖాస్తులే అందాయి. వాస్తవానికి జిల్లాలో 33వేల మంది పట్టభద్రులు ఉండగా ఇప్పటి వరకు కేవలం 10వేల దరఖాస్తులు మాత్రమే అందాయి. పట్టబద్రుల ఎమ్మెల్సీ ఓటరుగా నమోదుకు జిల్లా అధికార యంత్రాంగం విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నప్పటికీ స్పందించడం లేదు. ఫిబ్రవరి 6 నాటికి ఫారం 18లో దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉండగా అది ఇంకా 10 రోజులు మాత్రమే ఉండడం గమనార్హం. గత ఎన్నికల్లో జిల్లాలో 85051 మంది ఓటర్లుగా నమోగు కాగా ఖమ్మం నగరంలో మాత్రం 33,985 మంది ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి(ఖమ్మం, వరంగల్, నల్లగొండ) త్వరలో ఎన్నికలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నది. ఈ నేపథ్యంలో ఓటర్ల నమోదుకు షెడ్యూల్‌ను ప్రకటించి దరఖాస్తులు స్వీకరిస్తున్నా పట్టభద్రులు మాత్రం అంతగా స్పందించక పోవడం గమనార్హం. ఇప్పటి వరకు అందిన 10వేల దరఖాస్తులను ఖమ్మం అర్బన్ కార్యాలయంలో ఆన్‌లైన్ చేస్తున్నారు. దరఖాస్తు ఫారం 18 ద్వారా మాన్యువల్‌గా www.telangana.nic.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.



ఖమ్మం అర్బన్ కార్యాలయంలో ఎమ్మెల్సీ దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న దృశ్యం

హైకోర్టు జడ్జిలను కలిసిన కలెక్టర్ ప్రియాంక



జడ్జిలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక అల

బూర్గంపాడు, జనవరి 27: భద్రాచలం అదనపు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ప్రారంభోత్సవానికి విచ్చేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తులను జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా శనివారం ఐటీసీ గెస్ట్‌హౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయమూర్తులు వి. వేణుగోపాల్, కాజా శరత్‌లకు కలెక్టర్ పూలబొకేను అందించారు. అనంతరం పలు విషయాలపై వారితో మాట్లాడారు.

మంగలిబోడులో వసతుల కోసం సర్వే



మంగలిబోడులో వివరాలు సేకరిస్తున్న అధికారులు

చంద్రుగొండ, జనవరి 27: మండల పరిధిలోని మద్దుకూరు అటవీ ప్రాంతంలోని మంగలిబోడులో మౌలిక వసతుల కల్పన కోసం అధికారులు సర్వే చేపట్టారు. గత 20 సంవత్సరాలక్రితం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలసవ వచ్చిన ఆదివాసీలు ఈ ప్రాంతంలో నివాసం ఉంటున్నారువీరు ఇటీవల హైదరాబాద్‌లో ప్రజావాణిలో సీఎం రేవంత్‌రెడ్డికి తమ నివాస ప్రాంతమైన మంగలిబోడులో ఎలాంటి వసుతుల లేవని, దుర్భర జీవీతం గడుపుతున్నామని మొరపెట్టుకున్నారు. మంగలిబోడు సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌ను సీఎంవో కార్యాలయం ఆదేశించటంతో రెవెన్యూ, అటవీ అధికారులు మంగలిబోడుల సర్వే నిర్వహించారు. రహదారి, తాగునీరు, విద్యుత్, పాఠశాల, వైద్యం తదితర సదుపాయాలు కల్పించాలని ఆదివాసీలు అధికారులను కోరారు. మంగలిబోడులో 23 కుటుంబాలు ఉన్నాయని, మెత్తం 126 మంది నివసిస్తుండగా వారిలో 60 మందివరకు చిన్నారులు ఉన్నట్లు సర్వే అనంతరం తహసీల్దార్ సాదియా సుల్తాన్ తెలిపారు. నిర్వహించిన సర్వే నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందచేస్తామన్నారు.

పల్లీ రైతు పరేషాన్



- యాసంగిలో వేరుశనగపై దృష్టిసారించిన రైతులు
- పంటను ఆశిస్తున్న పొగాకు లద్దెపురుగు, ఇతర తెగుళ్లు
- మొదటిదశలోనే నియంత్రించకపోతే మొత్తం పంటకే ఎసరు
- సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు



తెగుళ్ల ఆశించిన వేరుశనగ మొక్క

ఖమ్మం వ్యవసాయ, జనవరి 27: అన్నదాతలకు సాగు కష్టాలు తప్పడం లేదు. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పత్తి పంట ఆశించిన మేర దిగుబడి రాలేదు. దీంతో పెట్టుబడి కూడా రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా యాసంగిలో వేరుశనగ పంట సాగుచేస్తున్నారు. అయినా ప్రస్తుతం వారిలో తెగుళ్ల గుబులు మొదలైంది. వేరుశనగ పంట వేసి నెల రోజులు దాటకముందే మొక్కలను తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తుండడం ఆందోళనకు గురి చేస్తోంది. అయితే కొన్ని ప్రాంతాలలో వేరుశనగ వేసి నెల రోజులు దాటుతుండగా మరికొన్ని ప్రాంతాలలో ఇరవై రోజులు దాటినట్లు తెలుస్తోంది. వేసవి దృష్ట్యా సాగునీటి వసతి ఉన్న రైతులు వేరుశనగ సాగు చేస్తున్నారు.

విత్తన శుద్ధి కీలకం

నేల ద్వారా వ్యాపించే తెగుళ్లను అరికట్టడానికి విత్తనశుద్ధి కీలకంగా మారనుంది. విత్తన శుద్ధికి టెబ్యుకోనజోల్, మ్యాంకోజెబ్ లాంటి పొడి వాడాలి. కాండం కుళ్లు వైరస్ తెగులు ఆశించే ప్రాంతాల్లో ఇమిడాక్లోప్రైడ్‌ను నీటిలో కలిపి విత్తనాలకు పట్టించాలి. వేరుపురుగు ఎక్కువగా ఆశించే ప్రాంతాల్లో క్లోరిపైరిఫాస్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. వరి మాగాణి, కొత్తగా వేరుశనగ సాగు చేసేటప్పుడు ఎకరాకు సరిపడా రైజోబియం కల్చర్‌ను పట్టించాలి. వేరు, మొదలు, కాండం కుళ్లు తెగుళ్లు ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో కిలో విత్తనానికి 10 గ్రాముల ట్రైకోడర్మ విరిడిని పట్టించి విత్తుకోవాలి.

ఆకుముడత

ఈ పురుగు పంట విత్తిన 15 నుంచి 45 రోజుల వరకు ఆశిస్తుంది. ఈ పురుగు 2-3 ఆకులను గూడుగా మార్చి పచ్చదనాన్ని తినడంతో ఆకులు ఎండిపోయినట్లు కనిపిస్తాయి. పురుగు నివారణ కోసం క్లోరోపైరిఫాస్, ఎసిఫేట్‌ను కలిపి మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

పొగాకు లద్దెపురుగు

ఈ పురుగులు పగటివేళ మొక్కల అడుగున, మట్టి కింద ఉండి రాత్రిపూట మొక్కలను ఆశిస్తూ నష్టం చేస్తాయి. పిల్ల పురుగులు పత్రహరితం తిని వేయడంతో ఆకులు జల్లెడ మాదిరి కనిపిస్తాయి. ఎదిగిన లార్వాలు రాత్రిపూట ఆకులను పూర్తిగా తిని ఈనెలను మాత్రమే మిగుల్చుతాయి. ఈ పురుగు నివారణ కోసం ఎకరాకు 4-5 లింగాకర్షక బుట్టలు అమర్చాలి.



ఎర పంటలుగా పొద్దుతిరుగుడు, ఆముదం లాంటి విత్తనాలు ఎకరాకు 200 మొక్కలు ఉండేలా వేసుకోవాలి. పురుగులు చిన్నగా ఉన్నప్పుడు వేపగింజల కషాయం పిచికారీ చేయాలి.

తిక్క ఆకుమచ్చ తెగులు

పైరు 30 రోజుల దశలోపు ఆశించే ఆకుమచ్చ తెగులులో మచ్చలు ఆకుల పై భాగాన ముదురు గోధుమ రంగులో ఉంటాయి. ఆలస్యంగా వచ్చే తెగులులో మచ్చలు ఆకు అడుగు భాగాన నల్లని రంగులో ఉంటాయి.ఈ తెగులు ఎక్కువగా ఉన్నప్పుడు ఆకులు మొత్తం ఎండిపోయి రాలిపోతాయి. ఈ తెగులు నివారణ కోసం టెబ్యుకోనజోల్‌తో విత్తన శుద్ధిచేయడమే కాకుండా క్లోరోథాలోనిల్, టెబ్యుకోనజోల్ మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.



ఎండిపోతున్న వేరుశనగ పంట(ఫైల్)

మొదలు కుళ్లు తెగులు

విత్తనశుద్ధి చేయని పరిస్థితులలో ఈ తెగులు ఎక్కువగా ఆశిస్తుంది. విత్తనం మొలకెత్తిన తర్వాత నేలకు ఆనుకుని కాండంపై నల్లని శిలీంద్ర బీజాలతో కప్పి ఉంటుంది. ఒక్కోసారి విత్తనం మొలకెత్తకుండానే కుళ్లిపోతుంది. కాయలపై కూడా నల్లని మచ్చలేర్పడతాయి. మొక్కలు ఎండిపోయి చనిపోతాయి. వీటి నివారణకు పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలి. విత్తనశుద్ధితోపాటు కార్బండిజం, మాంకోజెబ్ కలిపి మొక్కల మొదళ్ల దగ్గర నేల తడిచేలా పిచికారీ చేయాలి

వేరుకుళ్లు తెగులు

ఈ తెగులు పంట 30 రోజుల దశలో ఉన్నప్పుడు ఎక్కువగా ఆశిస్తుంది. శిలీంద్రం నేల ద్వారా వ్యాప్తి చెందుతుంది. పంట మార్పిడి పాటించని పరిస్థితులలో తెగులు ఎక్కువగా వస్తుంది. ఈ తెగులు ఆశించినప్పుడు తల్లి వేరు కుళ్లిపోయి నలుపురంగుకు మారి నుజ్జునుజ్జుగా తయారవుతుంది. నివారణ కోసం తెగులు సోకిన మొక్కల చుట్టూ కార్బండిజం పొడి మందును నీటిలో కలిపి నేల తడిచేలా పిచికారీ చేయాలి.

తామర, పచ్చదీపపు పురుగులు

తామర పురుగులు ఆశించిన ఆకుల అడుగు భాగాన ఇనుము రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ పురుగులు కాండం కుళ్లు, మొవ్వ కుళ్లు తెగులును వ్యాపింపజేస్తాయి. పచ్చదీపపు పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసం పీల్చడంతో ఆకు కొన భాగాన 'వి'ఆకారంలో పసుపురంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణ కోసం మోనోక్రోటోఫాస్, వేపనూనె, సబ్బు పొడి, థయోమిథాక్సామ్ లాంటివి అవసరాలను బట్టి మార్చిమార్చి పిచికారీ చేయాలి.

తుప్పు, కుంకుమ తెగులు

ఈ తెగులు ఉధృతి యాసంగి పంటలో ఎక్కువగా ఉంటుంది. ఆకుల అడుగు భాగంలో ఎరుపు లేదా ఇటుక రంగు గల చిన్న పొక్కులు ఏర్పడతాయి. ఆకు పై భాగంలో పసుపు రంగు మచ్చలు ఏర్పడుతాయి. నివారణ కోసం క్లోరోథాలోనిల్, మాంకోజెబ్ మందులు కలిపి మొక్కలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.

ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చాలి

మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు

ఖమ్మం బైపాస్‌రోడ్, జనవరి కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు వెంటనే నెరవేర్చాలని మాజీ ఎమ్మెల్యే మార్తినేని. ధర్మారావు అన్నారు. నగరంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం జిల్లాపార్లమెంట్ సమావేశం నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ స్థానంలో బీజేపీ గెలుస్తుందని, మోదీపాలన చూసి ప్రజలు బీజేపీవైపు ఉన్నారన్నారు. కమ్యూనిస్టు పార్టీ చెరిగిపోయిందని, వారి వ్యవహారం చనిపోయే ముందు తీర్థం పోసినట్టుగా ఉందన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ మూడోస్థానంలో ఉందని, బీఆర్ఎస్ వైపు చూసేవారు లేరని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 50రోజులు దాటినా హామీలు నెరవేర్చడందలో విఫలమవుతోందని, సుబాబుల్ జామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారావు

రావడంలేదని రైతులకు మద్దతుగా వెంటనే ధర ఇవ్వాలని అన్నారు. ఈకార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, గల్లా సత్యనారాయణ, రంగాకిరణ్, నంబూరి రామలింగేశ్వరరావు, శ్రీకాంత్, బైరెడ్డి ప్రభాకరరెడ్డి, త్రిలోక్, వీవీ రమేష్, నరేందర్‌రావు, గంటేల విద్యాసాగర్, శ్యాంరాథోడ్ పాల్గొన్నారు.

ఒకేషనల్ విద్యార్థులకు క్లినికల్ శిక్షణ

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 27: ఇంటర్మీడియట్ ఎమ్మెల్టీ, ఒకేషనల్ కోర్సులో మార్చి- 2019 సంవత్సరం నుంచి ఉతీర్ణులైన విద్యార్థులు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ జిల్లా కేంద్రంలోని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో అందిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యా ధికారి కె.రవిబాబు తెలిపారు. ఈ శిక్షణకు ఎంపికైన విద్యార్థులు మాత్రమే రూ.1000లు ఆసుపత్రి పేరు మీదా డీడీ రూపంలో చెల్లించవలసి ఉంటుందని తెలిపారు. గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కానీ వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు బయోడేటా ఫారంతో పాటు రు.10ల పోస్టల్ స్టాంప్సు అతికించిన సొంత చిరునామా గల కవరును జతపర్చలని తెలిపారు. సంబంధిత ధ్రువీకరణ పత్రాల జిరాక్సు కాపీలను కూడా జతపరచి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో ఫిబ్రవరి 2వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు అందించాలని తెలిపారు.

ప్రరవే రాష్ట్ర మహాసభల ఏర్పాట్ల పరిశీలన

ఖమ్మం సాంస్కృతికం, జనవరి 27: మహిళలపై ట్రోలింగ్ సమస్య ఎజెండాగా ప్రజా రచయిత్రుల వేదిక (ప్రరవే) 17వ రాష్ట్రమహాసభలు ఖమ్మంలోని వేదిక ఫంక్షన్ హాల్‌లో ఫిబ్రవరి 10, 11 తేదీల్లో జరుగనున్న విషయం తెలిసిందే. సభల సన్నాహక ఏర్పాట్లను శనివారం ప్రరవే రాష్ట్ర నాయకులు కాత్యాయిని విద్మహే, కేఎస్ మల్లీశ్వరి శనివారం ఖమ్మంలో పరిశీలించారు.

ఈసందర్భంగా వారు నగరంలోని సాహితీవేత్తలు మువ్వా శ్రీనివాస్, రవి మారుత్ తోపాటు కవయిత్రులు, మహిళా సంఘాల నేతలతో సన్నాహక సమన్వయ సమావేశం నిర్వహించారు. మహిళలపై ట్రోలింగ్ నిర్వచనం, మూలాలు, వర్తమానం అనే అంశంపై వీక్షణం మాసపత్రిక ఎడిటర్ ఎన్.వేణుగోపాల్, ట్రోలింగ్ అంతర్జాతీ య, జాతీయ కళారంగా లు అనే అంశంపై ప్రొఫెసర్ కె. సునీతరాణి, ట్రోలింగ్ సామాజిక రాజకీయ రంగాలు అనే అంశంపై ప్రముఖ స్త్రీవాద కవి కొండేపూడి నిర్మల, ట్రోలింగ్ సాంస్కృతిక, కళారంగాలు అనే అంశంపై సామాజిక కార్యకర్త కృష్ణకుమారి, ఈసందర్భంగా ప్రశ్నించే స్త్రీల అనుభవాలతో ముద్రించిన ట్రోల్ పుస్తకాన్ని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి ఓల్గా ఆవిష్కరిస్తారని, ప్రముఖ కథా రచయిత్రి వి. ప్రతిమ పరిచయం చేస్తారని తెలిపారు. కార్యక్రమలో భాగంగా నారి సారించిన నవల అనే పుస్తకంపై ప్రముఖ విమర్శకురాలు కొల్లాపురం విమల, శీల సుభద్రాదేవి, డాక్టర్ శిలాలోలిత ప్రసంగిస్తారని తెలిపారు. సభా కార్యక్రమాన్ని ప్రముఖ టీవీ వాఖ్యాత ఉదయభాను ప్రారంభిస్తారని ప్రముఖ స్త్రీవాద రచయిత్రి సి. మృణాళిని ముగింపు ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు.

అక్రమ క్వార్ట్జ్ నిల్వను పరిశీలించిన తహసీల్దార్

దుమ్ముగూడెం, జనవరి 27: చెరుపల్లి గ్రామంలో సర్వే నెంబరు 35-1-పిలో క్వార్ట్జ్(తెల్లరాయి) అక్రమ నిల్వలను తహసీల్దార్ చంద్రశేఖర్ శనివారం పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా నిల్వచేశారంటూ తహసీల్దార్‌కు సమాచారమందడంతో ఆ ప్రాంతాన్ని సందర్శించారు. తెల్లరాయి వ్యాపారం కోసం తన వద్ద అనుమతులున్నాయని డీలర్ తెలపడంతో లైసెన్సుపై విచారణ జరిపారు. ఏజెన్సీ ఏరియాలో వ్యవసాయభూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా వ్యవసాయేతర పనులను నిర్వహించరాదని డీలర్‌కు తెలిపారు. డిప్యూటీ డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ జారీ చేసిన లైసెన్సు రద్దుకోసం జిల్లా కలక్టర్‌కు నివేదిక



క్వార్ట్జ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

పంపుతానని తహసీల్దార్ అన్నారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ లక్ష్మయ్య, సర్వేయరు నర్సయ్య తదితరులు ఉన్నారు.

టేకులతండ గిరిజన పాఠశాల పరిశీలన

కామేపల్లి, జనవరి 27: కామేపల్లి మండల పరిధిలోని టేకులతండ గిరిజన పాఠశాలను ఏటీడీఓ జహీరుద్దీన్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజన పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో ఇంగ్లీష్ భాషపై వారి మెలకులవలను అడిగి తెలుసుకున్నారు. వంద రోజులు ప్రోగ్రామ్ విధి విధానాలను పరిశీలించారు. అన్నిటిపై సంతృప్తి చెంది విద్యార్థులను అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సపావట్ కిషన్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏటీడీఓ జహీరుద్దీన్

హక్కులతో పాటు బాధ్యతలుంటాయి

- జస్టిస్ ఈవీ వేణుగోపాల్

కొత్తగూడెం లీగల్, జనవరి 27: ఐక్యరాజ్యసమితిలోని మానవహక్కుల ప్రకటనకు అనుగుణంగా పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛ కల్పిస్తూ భారతరాజ్యాంగంలోని ఆర్టికల్ 21 నిర్దేశిస్తుందని, అయితే ఆ హక్కును హరించే అవకాశం ఉందని, హక్కులతో పాటు మనకు బాధ్యతలు కూడా ఉంటాయని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జ్ జస్టిస్ ఏనుగుల వెంకట వేణుగోపాల్ అన్నారు. కొత్తగూడెం బార్ అసోసియే షన్ ఆధ్వర్యంలో భద్రాద్రి జిల్లా కోర్టు ప్రాంగణంలో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21పై న్యాయచైతన్య సదస్సు శనివారం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జ్ జస్టిస్ ఏనుగుల వెంకట వేణుగోపాల్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.



న్యాయ చైతన్య సదస్సులో మాట్లాడుతున్న హైకోర్టు జడ్జ్ ఏనుగుల వెంకట వేణుగోపాల్

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ మన రాజ్యాంగం అమోఘమైనదని, ప్రపంచంలోనే అత్యంత పెద్దదని, భారతదేశ పౌరులకు అది అనేక హక్కులు కల్పిస్తున్నదని కొనియాడారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ కుమార్ మక్కడ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎస్సీ, ఎస్టీ కోర్టు, ఫ్యామిలీ కోర్టు నెలుకొల్పాలని, కొత్తగూడెం కోర్టులో సరిపడా సిబ్బంది లేరని, సిబ్బంది ఖాళీలను త్వరగా భర్తీ చేయాలని, కోర్టుకు వంద కోట్ల రూపాయలతో, పది ఎకరాల స్థలంలో నూతన భవన నిర్మాణం చేపట్టాలని, గిరిజన ప్రాంతాలకు కూడా సివిల్ కోర్టులను విస్తరింపజేయాలని హైకోర్టు న్యాయమూర్తిని కోరారు. బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఆధ్వర్యంలో హైకోర్టు న్యాయమూర్తిని శాలువాతో ఘనంగా సన్మానించి మెమోంటోను బహూకరించారు.

ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జ్ ఎం శ్యాంశ్రీ, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ జి. భానుమతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ బత్తుల రామారావు, మెదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎ. సుచరిత, ఇల్లెందు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావిలాల రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ ఆదర్శప్రాయుడు

ఖమ్మం కార్పొరేషన్, జనవరి27: ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాన్ని అంకితం చేసిన గొప్ప తెలంగాణవాది ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ అని తెలంగాణ ఉద్యమకారులు అన్నారు. శనివారం ఖమ్మం నగరంలోని మయూరిసెంటర్ సమీపంలో అమరవీరుల స్థూపం వద్ద ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ జయంతిని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 60 ఏళ్ల ఉద్యమ చరిత్రలో ఆటుపోట్లు ఎదుర్కొంటూ తన కుటుంబాన్ని పట్టించుకోకుండా తెలంగాణనే తన కుటుంబంగా భావించి ఉద్యమాలు నిర్వహించిన గొప్ప మేధావి జాదవ్ సార్ అనిపేర్కొన్నారు. తెలంగాణలో జరిగిన అన్ని ఉద్యమాల్లో జాదవ్ పాత్ర ఎంతో ఉందని, మానవ హక్కుల ఉద్యమంలో, నిజాం వ్యతిరేక ఉద్యమంలో, తెలంగాణ తొలి మలిదశల ఉద్యమాల్లో జాదవ్ ప్రముఖ పాత్ర పోషించారన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా ఉంటూ సమాజంలో జరిగే అన్ని పరిణామాలను విద్యార్థులకు తెలియజేస్తూ వారిని చైతన్యపరిచిన అభ్యుదయవాది అని పేర్కొన్నారు. రామ్‌మనోహర్ లోహియా అనుచరుడిగా ప్రభుత్వం నక్సలైట్లకు మధ్య చర్చలు జరిగినప్పుడు మధ్యవర్తిత్వం వహించిన ధీరుడని, తొలిదశ తెలంగాణ ఉద్యమంలో జైలు జీవితం గడిపి, మలిదశ ఉద్యమంలో



జాదవ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్‌కి నాయకత్వం వహించిన నిఖార్సైన తెలంగాణ నాయకుడు జాదవ్‌అ ని ఉద్యమకారులు పేర్కొన్నారు. ఆచార్య జయశంకర్‌కు ఉద్యమంలో తీసుకోవలసిన చర్యలపై అనేక సూచనలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు మలక సురేష్, డాక్టర్ ఆంజనేయులు, డోకుపర్తి సుబ్బారావు, పగడాల నరేందర్, లింగనబోయిన సతీష్, బుక్కా సత్యనారాయణ, దశరథ రామ్ కామిశెట్టి శ్రీనివాస్, భాస్కర్, షకీన, మిడిదొడ్డితిరుపతి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై నజర్.. పలు ప్రాంతాల్లో తనిఖీలు

ఖమ్మంకార్పొరేషన్, జనవరి 27: నగరపాలకసంస్థ అధికారులు ప్లాస్టిక్ నిషేధంపై మళ్లీ దృష్టి పెట్టారు. ఇటీవల నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ బి. సత్యనారాయణరెడ్డి పారిశుధ్య ఇన్స్‌పెక్టర్లు, జవాన్లతో సమావేశం నిర్వహించి, దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిషేధిత ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆ మేరకు శనివారం పారి శుధ్య సిబ్బంది నగరంలోని పలు ప్రాంతాల్లోని దుకాణాలు, కూరగాయల విక్రయించే దుకాణాల్లో తనిఖీలు నిర్వహించి, నిషేధించిన ప్లాస్టిక్ క్యారీబ్యాగులను స్వాధీనం చేసుకున్నారు. సదరు ప్లాస్టిక్‌సంచుల విక్రయాలు చేసినా, వినియోగించినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు.



ప్లాస్టిక్ క్యారీబ్యాగులను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

పేరుకుపోతున్న ప్లాస్టిక్.. నగరంలోని డంపింగ్‌యార్డులో ప్లాస్టిక్ పేరుకుపోతున్నది. చెత్తను సేకరించేటప్పుడు దానిలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు ఉండటంతో తడిచెత్తను ఎరువుగా మార్చటం సాధ్యంకావటం లేదు. ఫలితంగా చెత్తలో కలిసి ప్లాస్టిక్ డంపింగ్‌యార్డులో పేరుకుపోతున్నది. దీంతో తడి, పొడిచెత్తలను వేరువేరుగా సేకరించే సమయంలో ప్లాస్టిక్ క్యారీబ్యాగులు ఉంటే వాటిని వేరే సేకరించాలని నగరపాలకసంస్థ సహాయ కమిషనర్ పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు.

కారుణ్య నియామకాలకు వైద్య పత్రాల అందజేత

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి 27: ఖమ్మం రీజియన్ పరిధిలోని ఆర్టీసీ డిపోలు, బస్టాండ్‌లకు సంబంధించి వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబ సభ్యులకు ఆర్టీసీ కారణ్య నియామకాలను అందిస్తుంది. దీనిలో భాగంగా శనివారం 14మందికి నగరంలోని నూతన బస్టాండ్‌లోని ఆర్టీసీ వైద్యశాలలో వారికి వైద్య పరీక్షలు నిర్వహించింది. వారికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ గిరిసింహరావు అందించారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ అధికారి శ్రీహరి, శ్రీమన్నారాయణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగమే అన్ని చట్టాలకు మూలం

- న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాష
- ఖమ్మం జిల్లా జైలులో అవగాహన సదస్సు నిర్వహణ



మాట్లాడుతున్న న్యాయాధికారి జావీద్‌పాషా

ఖమ్మం లీగల్ జనవరి 27: దేశంలో రూపొందే అన్ని చట్టాలకు రాజ్యాంగమే మూలమని, అన్ని చట్టాలు రాజ్యాంగానికి లోబడే ఉంటాయని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికారసంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అన్నారు. దానవాయిగూడెంలోని జిల్లా జైలులో న్యాయాధికారి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముద్దాయిలకు, శిక్ష అనుభవిస్తున్న నేరస్తులకు జువనైల్ జస్టిస్ చట్టాన్ని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జైలు పర్యవేక్షణాధికారి ఏ.శ్రీధర్, ఇతర అధికారులు లక్ష్మీనారాయణ, సక్రు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వ ప్రాధాన్యం పెంచాలి

వివిధ కోర్టులలో పెండింగులో ఉన్న కేసులను మధ్యవర్తిత్వ పరిష్కార ప్రక్రియ ద్వారా పరిష్కరించే ప్రయత్నాలను ముమ్మరం చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి, మధ్యవర్తిత్వ కేంద్ర కోఆర్డినేటర్ మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా పిలుపునిచ్చారు. శనివారం మధ్యవర్తిత్వ న్యాయవాదులతో ఆయన సమావేశం నిర్వహించారు. కోర్టులలో కేసు ఉన్న ప్రతీఒక్క కక్షిదారునికి మధ్యవర్తిత్వ కేంద్రం లభ్యత, పనితీరు గురించి తెలియచెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. మధ్యవర్తిత్వ కేంద్రం ద్వారా ఎక్కువ కేసులను పరిష్కరించి కక్షిదారులలో నమ్మకం పెంచాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీనివాసశర్మ, పి.వెంకటేశ్వర్లు, రవీంద్రశర్మ, ఎన్.రమాదేవి, వై.సుబ్ర హ్మణ్యం, మారగాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఆదివారం 28 జనవరి 2024
కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

మంత్రి పొంగులేటిని కలిసిన ఐఎన్‌టీయూసీ నాయకులు


పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

రుద్రంపూర్, జనవరి 27: రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలో శనివారం కొత్తగూడేనికి చెందిన ఐఎన్‌టీయూసీ నాయకులు కలిశారు. మంత్రి పొంగులేటికి కొత్తగూడెం సింగరేణి ఏరియా వైస్‌ప్రెసిడెంట్ ఎండి. రజాక్, కార్పొరేట్ వైస్‌ప్రెసిడెంట్ పింత ంబరంలు పుష్పగుచ్ఛాన్ని అందించి శాలువ కప్పి సన్మానించారు. తనను వైస్ ప్రెసిడెంట్‌గా నియమించినందుకు రజాక్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపి, సింగరేణిలో కార్మికుల సమస్యల పట్ల చిత్త శుద్ధితో పని చేస్తానని, ఐఎన్‌టియుసీ నిర్ణయాలను తప్పకుండా అమలు చేస్తానని తెలిపారు. కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించే విధంగా కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

తూకాన్ని పరిశీలించాలి

టేకులపల్లి, జనవరి 27: వస్తువు కొనుగోలులో వినియోగదారులు విధిగా తూకాన్ని పరిశీలించాలని తూనికలు, కొలతల జిల్లా అధికారి కె.మనోహర్ సూచించారు. శనివారం టేకులపల్లి వారంతపు సంతలో ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వినియోగదారులు తూకంలో మోసపోవద్దని అవగాహన కల్పించారు. వ్యాపారులు తూనికలు, కొలతల పరికరాలకు సకాలంలో ముద్రలు వేయించుకోని లైసెన్సులు పొందాలన్నారు. మండలంలోని పలు పత్తి, చికెన్ వ్యాపారస్తుల దుకాణాలపై దాడులు నిర్వహించి 11కేసులు నమోదు చేసి రూ.40వేలు జరిమానాలు విధించామన్నారు.

రేపటి ప్రజావాణికి అధికారులు హాజరుకావాలి: కలెక్టర్

కొత్తగూడెం జనవరి 27: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక శనివారం తెలిపారు. అధికారులు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖల అధికారులు, ఆర్డీఓలు, ప్రత్యేక ఉప కలెక్టర్లు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, నిర్దేశించిన సమయానికి హాజరు కావాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెంచాలి

▸ తల్లీబిడ్డల మృతిపై విచారణ నిర్వహించాలి: ఎమ్మెల్యే కూనంనేని

సుజాతనగర్, జనవరి 27: వైద్య సిబ్బంది నిర్వాకంతోనే తల్లీ బిడ్డలు మృతి చెందారని, వారి మృతి తీవ్ర ఆవేదన కలిగించిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం సుజాతనగర్ మండలంలోని నాయకులగూడెంలోని మృతిరాలి స్వగృహంలో మృతురాలు చింతాల సింధు(23) చిత్రపటానికి పూలమాల వేసి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్తగూడెంలోని రామవరంలోని మాతా శిశు కేంద్రం ప్రభుత్వ వైద్యశాలలో ఈ నెల 24న మంగళవారం తల్లీ, బిడ్డల మృతికి కారణమైన విషాద ఘటనపై సమగ్ర విచారణ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఆ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సంబంధిత అధికారులకు ఒక లేఖ ద్వారా తెలియజేశానని అన్నారు. ఈ నెల 24వ తేదీ మంగళవారం పురిటి నొప్పులతో ప్రసవానికి వచ్చిన చింతాల సింధు(23) మాతా శిశు కేంద్రం వైద్య సహాయం అందించడంలో సిబ్బంది అలసత్వం వలన ప్రసవానంతరం తల్లీ, బిడ్డలు మృతి చెందారని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో భద్రత, భరోసా కల్పించడంలో వైద్య సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని, ఈ సంఘటన ప్రజలలో ప్రభుత్వ వైద్యశాలలపై అపనమ్మకాలను పెంచే ప్రమాదం ఉందని ఎమ్మెల్యే అన్నారు. పూర్తి వివరాలను కేంద్రంలోని డీఎంఈ (డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్) కి తెలిపినప్పటికీ వారు ఇంత వరకు స్పందించకపోవడం పట్ల ఆయన తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. ఈ సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని, బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసూతి కేంద్రాలపై ప్రజలలో విశ్వాసం, నమ్మకం పెరిగేలా తగిన చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దస్రు, నాయకులు మల్లేష్, హనుమంతరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సింధు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

బొగ్గు రవాణాలో కీలక పాత్ర పోషించిన ఆర్‌సీహెచ్‌పీ

▸ కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేమా రాజు


మాట్లాడుతున్న జీఎం షాలేమారాజు

రుద్రంపూర్, జనవరి27: బొగ్గు రవాణాలో కొత్తగూడెం ఏరియాలో రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) కీలక పాత్ర పోషించిందని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేమారాజు తెలిపారు. ఉత్పత్తి చేసిన బొగ్గును సకాలంలో రవాణ చేయడం వల్ల వినియోగదారుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఆర్‌సీహెచ్‌పీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం ప్రసంగిస్తూ 16 వేల టన్నుల కెపాసిటి కలిగిన బంకర్ ద్వారా ప్రతి రోజు పది నుంచి రోపులను రవాణా చేస్తుందన్నారు. 2021-2022 సంవత్సరంలో 94.65 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేసి రికార్డు సృష్టించిందన్నారు. సత్తుపల్లి ఓపెన్ కాస్ట్ నుంచి సైతం పెద్ద ఎత్తున బొగ్గు రవాణా చేసి విద్యుత్ ప్లాంట్‌లకు పంపించామన్నారు. 25 సంవత్సరాల ఆర్‌సీహెచ్‌పీ చరిత్రలో కీలక పాత్ర పోషించిన ఉద్యోగులను, కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సోషల్ జీఎం కోటిరెడ్డి, ఏరియా ఇంజనీర్ దుర్గాప్రసాద్, ఆర్‌సిహెచ్‌పి ఇన్‌చార్జి కరీముల్లా, విశ్వేశ్వరరావు, ఉద్యోగులు, కార్మికులు, కార్మికుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి తీర్మానం

● బడ్జెట్ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసుధన్‌రాజు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, జనవరి27: జిల్లా గ్రంథాలయ అభివృద్ధికి తీర్మాణం చేసినట్లు స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ మధుసుధన్‌రాజు తెలిపారు. శనివారం జిల్లా గ్రంథాలయంలో బడ్జెట్ సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ 2024 - 2025 బడ్జెట్‌తో పాటు, గ్రంథాలయ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను తీర్మానించామన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటి నుండి రావాల్సి సెస్ బకాయిల వివరాలపై నివేధికను అందజేయాలని తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సమావేశంలో డిపిఆర్‌వో శ్రీనివాస్, డీపీవో రమాకాంత్, డీఈవో వెంకటేశ్వరచారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎ.మంజువాణి, ఆఫీస్ ఇన్‌చార్జీ ఎం.నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

కొత్తగూడెం సాంస్కృతికం, జనవరి 27: బీజేపీ జిల్లా నూతన కమిటీని శనివారం నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కెవి.రంగాకిరణ్ తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శులుగా చింతలచెరువు శ్రీనివాసరావు, మడి రవి, తాటి పాముల అయిలయ్య జిల్లా కార్యదర్శులుగా కణితి లక్ష్మీ, బాణోత్ విజయలక్ష్మీ, భైరి నిర్మల, ముత్యాల వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు యర్రంరాజు బెహర, జాడె వరప్రసాద్, బిజ్జం శ్రీనివాసరెడ్డి, పసుమర్తి సతీష్, జి.రాంచంద్రనాయక్, కార్యాలయ కార్యదర్శిగా కొండి ప్రభాకర్, కోశాధికారిగా ఎస్‌విటి కొండాలను ఎన్నుకున్నట్లు తెలిపారు. రంగా కిరణ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నాయకులు జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన కోరారు. మహిళా మోర్చ, యువమోర్చ కమిటీలను కూడా నియమించామన్నారు.

కేంద్ర విధానాలను నిరసిస్తూ

26న దేశ వ్యాప్త సమ్మె: సీఐటీయూ

రుద్రంపూర్, జనవరి 27: స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ, బడ్జెట్ కేటాయింపులను తగ్గిస్తూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఫిబ్రవరి 26న దేశ వ్యాప్త సమ్మెను చేపట్టడం జరిగిందని, దీనిలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయు రాష్ట్ర ఉపధ్యక్షుడు పాలడుగు సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయు కార్యాలయంలో ఆ సంఘం జిల్లా నాయకులు వెంకటప్పయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్పొరేట్ శక్తులకు అమ్మేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ కార్మికుల, ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎజె.రమేష్, జిల్లా నాయకులు విజయలక్ష్మీ, వెంకట్, మల్లేశ్వరీ పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం

● పలు బిల్లుల చెల్లింపులకు ఆమోదం


చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పాలకవర్గ సభ్యులు

కొత్తగూడెం టౌన్, జనవరి 27: కొత్తగూడెం పురపాలక సంఘ సాధారణ సర్వసభ్య సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అధ్యక్షతను శనివారం నిర్వహించారు. మున్సిపల్ కౌన్సిల్ పాలకవర్గం ఏర్పడి నాలుగు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా పట్టణ ప్రజలకు, మున్సిపల్ సిబ్బందికి, కౌన్సిల్ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో కోతులను, కుక్కలను పట్టుకొనుటకు రూ.4 లక్షలు, శానిటేషన్ పనులకురూ. రూ.5 లక్షలు, గణేష్ మట్టి విగ్రహాల పంపిణీకి రూ. లక్ష, హైకోర్టు లీగల్ చార్జీలు రూ. లక్ష, తాగునీటి పైపులైన్ల లీకులకు రూ. 2 లక్షలు, కూలీలైన్‌లో కొత్తపైప్‌లైన్ కోసం రైల్వే వారికి రూ. లక్ష, రామాటాకీస్ ఏరియాలో ఇంటర్ కనెక్షన్ కోసం రూ. లక్ష, లీకేజీలను సరిచేయుటకు రూ. 5లక్షలు, సాధారణ ఎన్నికల సందర్భంగా రూ. 4.99 లక్షలు పురపాలక సాధారణ నిధుల నుంచి బిల్లులు చెల్లింపునకు ఆమోదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ జి.రఘు, డీఈ రవికుమార్, మేనేజర్ ఎల్‌వీ సత్యనారాయణ, అసిస్టెంట్ ఇంజనీర్లు సాయితి, డి.రాములు, టీపీఎస్ బి ప్రభాకర్, ఎం అశోక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకే టాలెంట్‌టెస్ట్

జూలూరుపాడు, జనవరి 27: విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు టాలెంటెస్ట్ ఎంతో దోహదపడతాయని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యులు ధర్మారావు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య తెలిపారు. శనివారం జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో మండల స్థాయిలో చెకుముకి టాలెంటెస్ట్‌ను నిర్వహించారు. ఈ పోటీలలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు మాధ్యమాలలో వేరు వేరుగా పరీక్ష నిర్వహించారు. ఆంగ్ల మాధ్యమంలో కాకర్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించగా, జూలూరుపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచారు. తెలుగు విభాగంలో జూలూరుపాడు ఉన్నత పాఠశాల ప్రథమ, కాకర్ల పాఠశాల ద్వితీయ స్థానాలలో నిలిచారు. ప్రవేటు పాఠశాలల విభాగంలో పడమటనర్సాపురం వశిష్ట ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ సభ్యుడు సామేలు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు ఛలో కలెక్టరేట్

● ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరభద్రం

కొత్తగూడెం టౌన్, జనవరి 27: విద్యారంగ సమస్యల పరిష్కారానికి సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఛలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బుర్రా వీరభద్రం తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో, కళాశాలల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ములకలపల్లి, సుజాతనగర్, కొత్తగూడెం, దమ్మపేట మండల కేంద్రాలలో నూతన వసతి గృహాలను ఏర్పాటు చేయాలని 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ మెనూను అందించాలని డిమాండ్ చేశారు. ట్యూషన్ ఫీజులు చెల్లించని కారణంగా విద్యార్థులు తీవ్రమైన సమస్యను ఎదుర్కొంటున్నారని, ప్రవేటు యాజమాన్యాలు కళాశాలలను మూసివేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మందా నాగకృష్ణ, కొత్తగూడెం డివిజన్ ఉపాధ్యక్షుడు రాంచరణ్, పట్టణ కార్యదర్శి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి టెస్టులో త్రివేణి విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల డైరెక్టర్ వీరేంద్ర చౌదరి

కొత్తగూడెం సింగరేణి, జనవరి 27: చెకుముకి సైన్స్ సంబురాల్లో జిల్లా స్థాయికి త్రివేణి విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల యాజమాన్యం తెపారు. శనివారం స్థానిక లక్ష్మీదేవిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబురాలు 2023-24లో భాగంగా పాఠశాల స్థాయిలో ఉత్తీర్ణులైన ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పాఠశాలలో మండల స్థాయిలో పాల్గొన్న త్రివేణి విద్యార్థులు కే.నేహా సంజన, బి. నేహా శ్రీ బద్రన్, సీహెచ్. మోక్షిత ప్రథమ స్థానాన్ని సాధించి జిల్లా స్థాయికి ఎంపిక కావడం హర్షణీయమని పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో గొల్లపూడి జగదీశ్, సీఆర్‌ఓ కాట్రగడ్డ మురళీ కృష్ణ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్ సింగ్, వైవి సురేష్, వైస్ ప్రిన్సిపాల్ సౌజన్య, శ్రీకాంత్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా నరసింహారావు



జూలూరుపాడు, జనవరి 27: మండలంలోని కాకర్ల గ్రామంలోని పాలగుట్టపై గల శ్రీ సంతాన వేణుగోపాలస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా అదే గ్రామానికి చెందిన అల్లాడి నరసింహారావు ఎన్నికయ్యారు. శనివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులతో సమావేశాన్ని నిర్వహించి చైర్మన్‌ను ఎన్నుకున్నారు. సమావేశంలో పాల్గొన్న వారిలో ఎక్కువ మంది అల్లాడి నరసింహారావు వైపు మొగ్గు చూపడంతో ఆయనను చైర్మన్‌గా ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బంద్రుగొండలో వైద్య శిబిరం

పాల్వంచ రూరల్, జనవరి 27: మండలంలోని జగన్నాథపురం పీహెచ్‌సీ పరిధిలోని బంద్రుగొండ గ్రామంలో వైద్యాధికారులు రాజు, కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. బంద్రుగొండ పరిధిలోని 256 మంది ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది రోగుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేసి వారికి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పద్మ, పంచాయతీ కార్యదర్శి నారాయణ, వైద్య సిబ్బంది విజయ లక్ష్మి, జ్యోతి, రామిరెడ్డి ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రమందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

పినపాక, జనవరి 27: గ్రామంలో నెలకొన్న మౌలిక సమస్యలను పరిష్కరించాలని కోరుతూ.. తోగ్గూడెం గ్రామ కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. శనివారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రమందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గ్రామంలో మంచినీటి సమస్య నెలకొందని, రేషన్ సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారని, విద్యుత్ స్థంబాలు, విద్యుత్ లైన్‌లు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే ఆయా శాఖల అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిటిమల్ల సతీష్, పూనెం వెంకటేశ్వర్లు, పాయం వెంకటేశ్వర్లు, నల్లూరి లక్ష్య తదితరులు పాల్గొన్నారు.

యాదవులను బీఆర్ఎస్ మోసం చేసింది: జారే


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే

దమ్మపేట, జనవరి 27: యాదవులను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని అశ్వారావుపేట ఎమ్మెల్యే ఎమ్మెల్యే జారే ఆదినారాయణ విమర్శించారు. దమ్మపేట రైతువేదికలో శనివారం యాదవసంఘం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొర్రెలను కాసే వారికి గొర్రెలు ఇవ్వకుండా చదువుకునే వారికి గొర్రెలు ఇచ్చి వారిని గొర్రెల కాపరులగా మార్చిందని ఆరోపించారు. కేవలం ఒక్క విడత మాత్రమే నామమాత్రంగా గొర్రెలు ఇచ్చి యాదవులంతా అభివృద్ధి చెందారని చెప్పటం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో యాదవసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మచ్చా శ్రీను యాదవ్, టీపీసీసీ సభ్యుడు నాగ శీతారాములు, జిల్లా యాదవసంఘం అధ్యక్షుడు పరమేష్‌యాదవ్, మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సింహంకు అభినందన

గత శాసనసభ ఎన్నికల్లో కాంగ్రె పార్టీ ఆరు పతకాలను ఇంటింటికి విస్తృతంగా ప్రచారం చేసి రాష్ట్రస్థాయిలో ప్రశంశా పత్రాన్ని పొందిన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిల నర్సింహంను ఎమ్మెల్యే ఆదినారాయణ గండుగులపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం అభినందించి సత్కరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని కోరారు.

'హలో శుభోధయం'లో పాల్గొన్న ఎమ్మెల్యే

ములకలపల్లి: హలో శుభోదయం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ములకలపల్లి మండలంలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే జారేకు మహిళలు ఘన స్వాగతం పలికారు. అయాగ్రామాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్లగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సుబ్బనపల్లిలో ఆశా వర్కర్లకు వేతనాలు పెంచాలని వినతిపత్రం అందజేసారు. ఈ కార్యక్రమంలో నర్సింహారావు, పత్తీలాల్, రవి, అంజి జహీర్ పాల్గొన్నారు.

ఏరియా జీఎంకు ఏఐటీయూసీ వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

మణుగూరుటౌన్, జనవరి 27: రాష్ట్రంలో జరిగిన సాధారణ, సింగరేణి యూనియన్ ఎన్నికల నేపధ్యంలో నాలుగు మాసాలుగా సింగరేణి వ్యాప్తంగా ఎదురుచూస్తోన్న మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులు, ఎక్స్‌టర్నల్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు తక్షణమే నియామక పత్రాలను అందజేయాలని ఏఐటీయూసీ నాయకులు కోరారు. ఈ మేరకు శనివారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. సింగరేణి వ్యాప్తంగా ఎంపికైన సుమారు 600 మందికి పైగా నియామక పత్రాల కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ ఉపాధ్యక్షులు రామనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచి సెక్రటరీ మేకల ఈశ్వర్, ఈసీ మెంబర్ జానకి ప్రసాద్, భీమ్‌సింగ్ తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీని పరామర్శించిన ఎంపీపీ

అశ్వాపురం, జనవరి 27: మండల పరిధిలోని అమ్మగారిపల్లి ఎంపీటీసీ సభ్యుడు కొర్సా ముత్తయ్యను శనివారం ఎంపీపీ ముత్తినేని సుజాత పరామర్శించారు. ముత్తయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన ముత్తయ్యను పరామర్శించి ఎంపీపీ సుజాత ఆయన ప్రస్థుత ఆరోగ్యపరిస్థితులు, యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షర్ఫుద్దీన్, ఎంపీటీసీ సంఘం మండల అధ్యక్షుడు కమటం నరేష్, ఎంపీటీసీ సభ్యులు ఏనిక రవి, కొమరం చిట్టెమ్మ, బేతం రామకృష్ణ, జయ, నాయకులు కిలారు శేషగిరిరావు తదితరులు ఉన్నారు.

రెండు ఇసుక ట్రాక్లర్లు పట్టివేత

అశ్వారావుపేట రూరల్, జనవరి 27: అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గాండ్లగూడెం సమీపంలోని వాగుల నుంచి రెండు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అశ్వారావుపేటకు తరలిస్తున్నారు. అశ్వారావుపేట గ్రామశివారులో రెండు ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. ఇసుక తరలింపుకు అనుమతులు లేకపోవటంతో రెండు ట్రాక్టర్లను తహసీల్దారు కృష్ణప్రసాద్‌కు అప్పగించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు

మణుగూరుటౌన్, జనవరి 27: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా ఐఎన్‌టీయకూసీ ఉపాధ్యక్షుడు వత్సవాయి కృష్ణంరాజు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును శనివారం మర్యాదపూర్వకంగా కలిసారు. కృష్ణంరాజు సింగరేణి కాలరీస్ కంపెనీ గుర్తింపు కార్మిక సంఘం ఐఎన్‌టియుసీ ఏరియా బ్రాంచి ఉపాధ్యక్షునిగా ఎన్నికైన విషయం విదితమే. కాగా నూతనంగా ఎన్నికైన కృష్ణంరాజు ఎమ్మెల్యేను కలసి యూనియన్ పరంగా కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో తగిన సహకారమివ్వాలని, సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే పాయం కార్మిక వర్గానికి ఎల్లప్పుడు అండగా ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి ఎళ్లవేళల కృషి చేస్తానని హామినిచ్చారు. కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడు ముందుండి కార్మికులకు అండగా ఉండాలని కృష్ణంరాజుకు ఎమ్మెల్యే సూచించారు. ముందుగా నూతనంగా ఎన్నికైన కృష్ణంరాజుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించి మిఠాయి తినిపించారు. కార్యక్రమంలో నాయకులు అబ్బులు, షర్ఫుద్దీన్, రాములు, గణేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి రెస్టారెంట్‌పై దాడి


ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

భద్రాచలం, జనవరి 27: భద్రాచలంలోని బ్రిడ్జి సెంటరు సమీపంలో ఉన్న రెస్టారెంట్‌పై శుక్రవారం అర్ధరాత్రి దాడి జరిగింది. స్థల యజమాని, రెస్టారెంట్ ఓనర్ల మధ్య ఒప్పందం విషయంలో మాటలు నడుస్తున్న క్రమంలో రాత్రి రెస్టారెంట్ బంద్ చేసి ఇంటికి వెళ్లిన తరువాత కొంత మంది వచ్చి తాళాలు పగల కొట్టి రెస్టారెంట్ ఫర్నీచర్ ధ్వంసం చేసినట్లు హోటల్ యజమానులు కొండా రెడ్డి, రమ్యశ్రీ విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా ఆస్తి నష్టం వాటిల్లిందని వారు హోటల్ ముందు నిరసనకు దిగారు. వీరికి భద్రాచలం హోటల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మధువన్‌రెడ్డి, జిందా ఇతర హోటల్ యజమానులు మద్దతు తెలిపారు. దాడిని నిరసిస్తూ హోటల్ యజమానులు హోటళ్లను బంద్ చేశారు. న్యాయం జరిగేంత వరకు పట్టణంలోని హోటళ్ల బంద్‌కు వారు పిలుపునిచ్చారు. కాగా హోటళ్లను బంద్ చేయాలని అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చిన క్రమంలో ఒక హోటల్ యజమాని బంద్ చేయక పోవంతో ఆ విషయం తెలుసుకొని అక్కడికి వెళ్లి తమకు సహకరించాలని కోరిన క్రమంలో హోటల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు మధువన్‌రెడ్డిపై మరో మాజీ అధ్యక్షుడు దాడి చేసినట్లు అసోసియేషన్ నాయకులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో ఈ విషయాలపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా స్థలం యజమానులు రెస్టారెంటు నిర్వాహకులతో ఒప్పందం 2020కే ముగిసిందని అనంతరం ఎటువంటి పొడిగింపు జరగలేదన్నారు. ఖాళీ చేయమని కోరుతున్నాము తప్ప దాడికి తమకు ఎటువంటి సంబంధం లేదని తెలిపారు.

వృద్ధుడి వైద్య ఖర్చులకు సాయం వితరణ


వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, జనవరి 27: గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న మున్సిపాలిటీ పరిధిలోని శివలింగాపురం గ్రామానికి చెందిన వీరండి బ్రహ్మయ్యను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పరామర్శించారు. శనివారం క్యాంపు కార్యాలయానికి వచ్చిన బ్రహ్మయ్యను ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వెంటనే బ్రహ్మయ్య వైద్య చికిత్సల నిమిత్తం రూ.5 వేల నగదును అందజేశారు. ప్రభుత్వ అమలు చేయనున్న దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు ఇప్పిస్తానని హామినిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల వినతి

బూర్గంపాడు: అర్హులైన జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ.. బూర్గంపాడు మండలానికి చెందిన జర్నలిస్టులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కోరారు. ఈ మేరకు శనివారం బూర్గంపాడు మండలానికి చెందిన జర్నలిస్టులు మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి వినతి పత్రమందజేశారు. ఈ సందర్భంగా మండలంలోని లక్ష్మీపురం, నకిరిపేట గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములను పరిశీలించాలని కోరారు. జర్నలిస్టుల అభ్యర్థనపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించారు.

ఘనంగా గురుదేవ్ పాఠశాల వార్షికోత్సవం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

చర్ల, జనవరి 27: ఉత్సాహం ఉరకలేసింది. యువత ఆటపాటలతో సందడిగా గడిపింది. సాంస్కృతిక కార్యక్రమాలతో ఆ ప్రాంతం దద్దరిల్లి పోయింది. చర్ల మండల కేంద్రంలోని గురుదేవ్ విద్యాలయంలో శనివారం పాఠశాల వార్షికోత్సవం ఘనంగా ముగిసింది. నమస్కృతి పేరిట గత మూడు రోజులు నిర్వహించిన ఈ కార్యక్రమాలకు చర్ల మండలంలోని ప్రముఖులు, అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు హాజరయ్యారు. శనివారం ప్రారంభ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హెచ్‌జీవీ ప్రసాద్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువులో ముందుండాలన్నారు. చదువే జీవితాన్ని మార్చేస్తుందని గుర్తు చేశారు. బట్టీపట్టి చదివే విధానం కాకుండా విశ్లేషనాత్మక ధోరణిలో చదవాలన్నారు. ప్రతీ విద్యార్థి పోటీ తత్వంతోనే ఉన్నత శిఖరాలకు చేరుతారని గుర్తు చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల అకాడమిక్ కోర్డినేటర్ ఎంవీ, సుబ్రమణ్యం, ఉపాధ్యాయస్వాతి, రజని, విశాల, మేఘన, వాసు, సుధాకర్, రాజ్‌కుమార్, రహీం తదితరులు పాల్గొన్నారు.